జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || శుక్రవారం 11, అక్టోబర్ 2024

## డిజిటల్ మీడియాలో ..

# జయహో "మహానాడు"

# 2,03,132

## ఈ-పేపర్ పాఠకులకు సగర్వంగా సవినయంగా సెల్యూట్



మార్చి 1 న ప్రారంభమైన మన

మహానాడు ప్రస్థానంలో కలిసి నడుస్తున్న

మా అభిమాన పాఠకుల

అనుబంధానికి వందనం





సీనియర్ జర్నలిస్ట్
మార్తి సుబ్రమణ్యం
సంపాదక సారథ్యంలో





బోడెపూడి సుబ్బారావు (BSR)
సారథ్యంలో



జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || శుక్రవారం 11, అక్టోబర్ 2024 || ఎడిటర్ : మార్తి సుబ్రహ్మణ్యం





ముంబయిలో రతన్ టాటా పార్థివ దేహానికి నివాళులు అర్పించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్.



# సురేఖ సరే.. రఘునందన్ సంగతేమిటి?

- మంత్రి కొండా సురేఖపై పరువునష్టం దావా వేసిన నాగార్జున
- వ్యాఖ్యలు ఉపసంహరించుకున్న తర్వాత కూడా పట్టువదలని నాగ్
- కొండాకు లీగల్ నోటీసు పంపిన మాజీ మంత్రి కేటీఆర్
- సమంతకు చేనేత బ్రాండ్ అంబాసిడర్‌పై ఎంపీ రఘునందన్ వ్యాఖ్యల కలకలం
- చేనేత గురించి తెలియని సమంతకు ఆ హోదా ఇవ్వడంపై మతలబు ఉందని వ్యాఖ్య
- అప్పుడున్న వాళ్లకు రంగుల లోకంతో ఉన్న రక్తసంబంధం ఏంటో చెప్పాలంటూ కామెంట్
- సురేఖ తరహాలోనే రఘునందన్‌రావు వ్యాఖ్యలు
- ఇప్పుడు రఘునందన్‌పైనా నాగార్జున పరువునష్టం దావా వేస్తారా?
- సినీ, రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ

(మార్తి సుబ్రహ్మణ్యం)

కేటీఆర్‌నుద్దేశించి మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యల వివాదం ఇప్పుడిప్పుడే సర్దుమణుగుతోంది. సమంతను తన వద్దకు పంపాలంటూ కేటీఆర్ హీరో నాగార్జునను కోరాడని, లేకపోతే ఎన్ కన్వెన్షన్ కూల్చేస్తామని కేటీఆర్ బెదిరించారన్నది మంత్రి సురేఖ చేసిన మీడియా సమక్షంలో వ్యాఖ్య. ఆ ప్రకారంగా సమంతను కేటీఆర్ వద్దకు వెళ్లాలని, లేకపోతే మా ఇంట్లో ఉండవద్దని నాగ్–ఆయన తనయుడు.. సమంతను ఒత్తిడి చేసిన తర్వాతనే, సమంత–నాగచైతన్య విడాకులు తీసుకున్నారన్నది సురేఖ చేసిన వ్యాఖ్య.

ఆ తర్వాత దానిపై దుమారం రేగడం, అందుకు స్పందించిన సురేఖ.. తన వ్యాఖ్యలు ఉపసంహరించుకున్నానని ప్రకటించడం జరిగిపోయింది. అయినా ఈ అంశంలో తగ్గని నాగార్జున.. మంత్రి సురేఖకు వందకోట్ల రూపాయల పరువునష్టం దావా నోటీసు పంపించారు. అందుకు స్పందించిన నాంపల్లి కోర్టు.. నాగార్జున, మరికొందరు సాక్షుల వాంగ్మూలం నమోదు చేసింది.

ఈ ఎపిసోడ్‌పై సోషల్‌మీడియాలో ఇంకా చర్చ జరుగుతున్న సమయంలోనే.. బీజేపీ ఫైర్ బ్రాండ్, ఎంపి రఘునందన్‌రావు చేసిన వ్యాఖ్యలు ఈ వివాదాన్ని కొత్త మార్గం పట్టించాయి. సమంతకు సంబంధించి, న్యాయవాది అయిన రఘునందన్‌రావు తెరపైకి తెచ్చిన లా పాయింట్లు.. మర్చిపోయిన బంధాన్ని మరోసారి గుర్తుకు తెచ్చినట్టయింది. అంటే ఈ అంశంలో కొండా సురేఖ మర్చిపోయిన లా పాయింటును గుర్తు చేసి, ఆమె మద్దతుదారులకు మరో అస్త్రం అందించారన్న మాట.

కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు అప్పటి అక్కినేని నాగార్జున కోడలయిన సమంతను, తెలంగాణ ప్రభుత్వం చేనేతకు బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించింది. తెలంగాణలో సిరిసిల్ల, పోచంపల్లి ప్రాంతాలు చేనేతలకు ప్రసిద్ధి. అప్పట్లో తెలంగాణ చేనేతకు దేశవ్యాప్తంగా మార్కెటింగ్ కోసం, నాగార్జున కోడలయిన సమంతను దానికి బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించింది. ఇప్పుడు బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు సరిగ్గా అదే పాయింటును, సురేఖ–కేటీఆర్–నాగార్జున ఎపిసోడ్‌లో మళ్లీ వ్యూహాత్మకంగా తెరపైకి తీసుకురావడం ఆసక్తికరంగా మారింది. నిజానికి ఈ ఎపిసోడ్‌లో ఇది, మీడియా కూడా మర్చిపోయిన అంశమే.

సురేఖపై వేసిన పరువునష్టం కేసుకు సంబంధించి, నాగార్జున కోర్టులో వాంగ్మూలం ఇచ్చిన నేపథ్యంలో.. బీజేపీ ఎంపి ర ఘునందన్‌రావు ఒక టీవీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో చేనేత తెలియని, చీర తెలియని సమంతకు, కేసీఆర్ సర్కారు చేనేతకు బ్రాండ్ అంబాసిడర్ హోదా ఇచ్చిన విషయాన్ని ప్రస్తావించారు. ఫలితంగా కొండాసురేఖ–నాగార్జున–కేటీఆర్ ఎపిసోడ్ సహజంగానే చర్చనీయాంశమయింది.

"ఎన్ కన్వెన్షన్ అక్రమ కట్టడమని కోర్టు ఎప్పుడో చెప్పింది. ఎఫ్టీఎల్ బఫర్‌జోన్‌లో మూడున్నర ఎకరాలు ఆక్రమించి, దానిని నిర్మించారని హెచ్ఎండీఏ 2016లోనే నివే దిక ఇచ్చింది. అయినా కేసీఆర్ ప్రభుత్వం నాగార్జున ఎన్ కన్వెన్షన్‌ను కూల్చలేదు. అప్పుడే అక్కినేని వారి కోడలు సమంత చేనేతకు బ్రాండ్ అంబాసిడర్ అయింది. ఆమెకు చేనేత తెలవదు. చీర తెలవదు. ఆమెను తెచ్చి చేనేతకు బ్రాండ్

మిగతా.. 2లో

## 'పచ్చ కామెర్లోడి'లా ప్రధాని మోదీ తీరు!

- ఏపీసీసీ చీఫ్ షర్మిలా విమర్శ



విజయవాడ, మహానాడు: పచ్చ కామెర్లోడికి లోకమంతా పచ్చగా కనిపించినట్లుంది ప్రధాని మోదీ తీరు. ఈ దేశంలో విద్వేషాలను రెచ్చగొట్టేది బీజేపీ. కుల, మతాల మధ్య చిచ్చు పెట్టేది బీజేపీయేనని ఏపీసీసీ చీఫ్ షర్మిలా విమర్శించారు. ఈ మేరకు ఆమె గురువారం మీడియాతో ఏమన్నారంటే.. విభజన రాజకీయాలు చేసేది బీజేపీ. కుట్ర రాజకీయాలకు కేరాఫ్ బీజేపీ. మత రాజకీయాలకు జన్మస్థలం బీజేపీ. మతాన్ని కవచంలా అడ్డుపెట్టుకుని దర్జాగా దేశాన్ని దోచుకుంటూ.. దోస్తులకు సంపదను దోచిపెడుతూ.. కాంగ్రెస్ ను విద్వేషాల ఫ్యాక్టరీ అని మోడీ అనడం, దొంగే దొంగ దొంగ అని అరిచినట్లుంది. చావు తప్పి కన్ను లొట్టపోయినట్లుంది హర్యానాలో బీజేపీ విజయం. ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడినా.. ప్రజల మనసులో బలంగా నాటిన ప్రేమ, ఐక్యత సందేశం క్రమంగా ఉద్యమంగా, ఉప్పెనగా మారుతోందని బీజేపీకి తెలుసుకోవాలి. కాంగ్రెస్ మనుషుల్ని, వారి మనసులను గెలిచిందని గ్రహించాలి. నఫ్రత్, మొహబ్బత్ కు మధ్య జరిగిన యుద్ధంలో ప్రేమనే గెలిచింది. జమ్మూకాశ్మీర్ లో తెరుచుకున్న "మొహబ్బత్‌కి దుకాణ్" లు రేపు దేశం మొత్తం తెరుచుకుంటాయి. మోడీ హఠావో..దేశ్ బచావో నిజమవుతుంది. 10 ఏళ్లుగా దేశం వెలుగుతుందని పచ్చి అబద్ధాలు చెప్పున్న మోడీ.. "విశ్వగురు కాదు.. విష పురుగు" అని ప్రజలకు అర్థం అవుతుంది. విద్వేషాన్ని పెంచేది మోడీ..ప్రేమను పంచేది రాహుల్ అని స్పష్టం అవుతుంది.



04

రతన్ "టా...టా"



06

పెద్దిరెడ్డి అండ... పదవితో అక్రమాలే అతని అజెండా!



02

వైద్య సిబ్బంది పనివేళలు పాటించకపోవడంపై మంత్రి ఆగ్రహం

## సనాతన ధర్మానికి బ్రాండ్ అంబాసిడర్ పవన్ కళ్యాణ్



- హిందూ సనాతన ధర్మం అంటూ ఏమీ లేదు
- ధర్మం అంటే నియమం.. మతం కాదు
- హిందు అనబడేది భౌగోళిక గుర్తింపు
- సనాతన ధర్మం ప్రతి జీవికీ వర్తిస్తుంది
- వర్ణ వ్యవస్థను కుల వ్యవస్థగా మార్చి సనాతన ధర్మం గొప్పతనాన్ని నాశనం చేశారు

(టి.వి.గోవిందరావు)



నేడు దక్షిణ భారతంలో ప్రతీ వారి నోటా వినిపిస్తున్న పదం సనాతన ధర్మం. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పుణ్యమా అని, తిరుపతి లడ్డూలలో కల్తీ నేతితో ఈ సనాతన ధర్మం వెలుగులోకి వచ్చింది.

సనాతన ధర్మం భారత దేశంలో జన్మించిన ఒక ఆధ్యాత్మిక సంస్కృతి. ప్రపంచంలో ఉన్న అన్ని సంస్కృతులలో కెల్లా అతి పురాతన, ప్రాచీనమైన సంస్కృతి. సనాతనం అంటే శాశ్వతమైనది, ధర్మం అనగా ఆచర ణీయ కార్యం. సనాతన ధర్మం అంటే మతం కాదు ప్రాచీనకాలం నుండి అనుసరిస్తున్న ఒక జీవన విధానం. ఈ జీవన విధానం ఏ వ్యక్తి, వ్యక్తుల ఆలోచనల చేతనో ఏర్పడలేదు లేదా స్థాపించబడలేదు.

ఈ ధర్మానికి మూలం సృష్టికర్త అని భావించారు, ఎందుకంటే సనాతన ధర్మ మూలాలు వేద కాలపురి కతకు సంబంధించినవి. వేదాలలో రహస్య ఆత్మ జ్ఞానాన్ని సృష్టి ప్రారంభంలో దేవతలకు, జనులకు పంచారు. వేదాలలో ప్రస్తావించబడిన సనాతన ధర్మం యొక్క ఆధ్యాత్మిక మూలాలు స్వర్గంలో, భూమిపై విస్తరించి ఉన్నాయి. ప్రాచీన కాలంలో పర్షియా రాజ్య సరిహద్దులు దాటి భారత దేశములో ఉత్తర భూభాగాన ప్రవహిస్తున్న 'సింధు నది' ఒడ్డును చేరుకున్న పర్శిలు ఇక్కడి ప్రజలు 'హిందువులు' అని, భారత ఉపఖండాన్ని 'హిందుస్తాన్' అని పిలిచేవారు. ఎందుకంటే పర్శి భాషలో 'స' అనే అక్షరం లేదు దానికి బదులుగా 'హ' అనే అక్షరం వారు ఉపయోగించేవారు.

భారత దేశ భూభాగంలో దేవతలను ఆరాధించే విధానములు, ఆచార వ్యవహారములు, వైదిక కర్మలు పరిశీలించి, వేదాలను అనుసరించి దైనందిక జీవన విధానం, మనిషి మనుగడ సాగించేది కాబట్టి సనాతన ధర్మాన్ని 'మతం' అనే అభిప్రాయంతో ఉండేవారు. ఆ కారణం చేతనే సనాతన ధర్మం హిందూ మతంగా పరిగణలోకి వచ్చింది.

సనాతన ధర్మాన్ని జీవన శైలి అనే స్థాయి నుండి కేవలం ఒక మతం అనే స్థాయికి పరిమితం చేసి, భారత దేశ అస్తిత్వానికి మూల ఆత్మ అయిన సనాతన ధర్మం అనే ప్రత్యేకమైన సంస్కృతికి నష్టం చేకూర్చారు. అందువల్ల భారత దేశంలో ప్రతి ఒక్కరినీ హిందువుగా గుర్తించేవారు. కానీ ఇప్పుడు వేదాల ఆధారంగా జీవన విధానాన్ని ఆచరించే వారిని మాత్రమే, హిందువు అని పిలుస్తున్నారు.

మిగతా.. 2లో



## కొండా సురేఖకు నాంపల్లి ప్రత్యేక కోర్టు నోటీసులు

హైదరాబాద్,మహానాడు: మంత్రి కొండా సురేఖకు నాంపల్లి ప్రత్యేక కోర్టు నోటీసులు జారీ చేసింది. నాగార్జున దాఖలు చేసిన పరువునష్టం దాఖలు కేసులో ఈ నోటీసులు జారీ అయ్యాయి. అనంతరం తదుపరి విచారణను నాంపల్లి కోర్టు ఈ నెల 23వ తేదీకి వాయిదా వేసింది. నాగార్జున దాఖలు చేసిన పిటిషన్ విచారణ సందర్భంగా, రెండో సాక్షి స్టేట్‌మెంట్‌ను కోర్టు రికార్డ్ చేసింది. రెండు రోజుల క్రితమే నాగార్జున, మొదటి సాక్షి సుప్రియ స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేసింది.

## మన్మథ లీల.. 'కమలం' గోల

- నవ్వుల పాలవుతున్న 'పువ్వు'
- 'కమలం'లో కోవర్టు ఆపరేషన్లు
- గుంటూరు బీజేపీ అధ్యక్షుడు వనమాపై హనీట్రాప్
- సుకన్యతో వీడియో కాల్‌లో దొరికిపోయిన వనమా
- తాజాగా జిల్లా మాజీ అధ్యక్షుడు పాటిబండ్ల రామకృష్ణ వీడియో రచ్చ
- అంబటి ఎపిసోడ్ సుకన్య.. బీజేపీలోనూ అలజడి
- గతంలో బీజేపీలో చేరిన సుకన్య
- సొంత పార్టీలో ఇద్దరు కీలకనేతల హస్తంపై హనీట్రాప్ అనుమానాలు
- సోషల్‌మీడియా రచ్చతో పదవులకు పాటిబండ్ల, వనమా రాజీనామా
- సుకన్యను సస్పెన్షన్ చేసిన నాయకత్వం
- మరి గతంలో ఒంగోలులో బాధితురాలి ఫిర్యాదుపై చర్యలేవీ?
- నాటి రాష్ట్ర అగ్రనేత వద్దకు మహిళను పంపించిన జిల్లా నేత
- తనను రాష్ట్ర నేత వాడుకున్నారంటూ వీడియో విడుదల చేసిన మహిళామోర్చా నేత
- వీడియో పంపినా ఇప్పటిదాకా చర్యలు తీసుకోని రాష్ట్ర నాయకత్వం
- పైగా జాతీయ నాయకుడి హోదా కల్పించిన వైనం
- ఇలాంటి ఆరోపణలతోనే ఓ జాతీయ నేత ప్రాధాన్యత తగ్గించిన నాయకత్వం
- గతంలో ఓ రాష్ట్ర మాజీ ప్రముఖుడిని ఉత్తరాదికి పంపిన వైనం

(అన్వేష్)

బీజేపీ అంటే సిద్ధాంతాలమడి కట్టుకునే పార్టీ అని చాలామంది నమ్మకం. భారతీయులంతా సోదరులు, సోదరీమణులనే టైపులో కనిపిస్తుంటారు. పెద్ద పెద్ద బొట్లు, చేతులకు రక్షలు, మెడలో రుద్రాక్షలు, ఒంటిపై కాషాయం కండువాతో కనిపించే 'కమలం'లో 'కామశాస్త్రజ్ఞుల' సంఖ్య పెరగడం, ఆ పార్టీ సంప్రదాయవాదులను కలవరపరుస్తోంది.

ఎన్నికల ముందు ఒంగోలులో మహిళా మోర్చా నేత ఒకరు.. తనను జిల్లా పార్టీ నేత, రాష్ట్ర పార్టీ అగ్రనేత వద్దకు పంపించారని, పిల్లల ఆకలి తీర్చేందుకు తాను తప్పు చేయక తప్పలేదంటూ.. ఆ బాధితురాలు పంపిన వీడియో నాయకత్వానికి చేరింది. బట్ నో యూజ్. పైగా సదరు బాధితురాలితో సుఖించిన అప్పటి రాష్ట్ర నాయకుడికి, జాతీయ నాయకుడి హోదా ఇచ్చేసింది.

ఇంతకూ ఆ బాధితురాలిని, రాష్ట్ర నేతాశ్రీ వద్దకు 'శ్రమదానం' కోసం పంపిన ఆ జిల్లా నేత.. పాపం ఆ మహిళా నేతకు చేస్తానన్న సాయం చేయలేదట. అప్పట్లో ఇది పార్టీలో కలవరం సృష్టించింది. ఆ వీడియోనే నాటి రాష్ట్ర నేతకు ఎంపీ సీటు రాకుండా చేసింది. అదే వీడియో అప్పట్లో ఆయన ప్రత్యర్థికి ఆయుధమయింది.

తాజాగా గుంటూరు జిల్లా పార్టీ అధ్యక్షుడు వనమా నరేంద్ర, మాజీ జిల్లా అధ్యక్షుడు, మీడియా ప్యానెల్ ప్రతినిధి పాటిబండ్ల రామకృష్ణ తమ పదవులు కోల్పోయేందుకు, కారణమైన హనీట్రాప్ అంశం చర్చనీయాంశంగా మారింది. ఈ ఎపిసోడ్‌లో గతంలో మాజీ మంత్రి అంబటి రాంబాబుతో ఫోన్‌లో మాట్లాడి, సోషల్ మీడియా ద్వారా ఆయన

మిగతా.. 2లో

జనం గుండె చప్పుడు

# మహానాడు

2

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || శుక్రవారం 11, అక్టోబర్ 2024 ||

# సురేఖ సరే.. రఘునందన్ సంగతేమిటి?

మొదటి పేజీ తరువాయి..

అంబాసిడర్‌ను చేశారు. ఆ సంబంధాలేమిటో వాళ్లకే తెలియాలి. అప్పుడున్న వాళ్లకు రంగుల లోకంతో ఉన్న రక్తసంబంధమేమిటో వాళ్లు చెప్పాలి. అవన్నీ చెప్పి నా నోరు పాడుచేసుకోను' అని రఘునందన్‌రావు చేసిన వ్యాఖ్య ఇప్పుడు సోషల్‌మీడియాలో కొత్తగా వైరల్ అవుతోంది.

ఇది ఒకరకంగా కొండా సురేఖ వ్యాఖ్యలకు, కొనసాగింపేనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. అసలు ఈ సమయంలో, వివాదానికి కేంద్ర బిందువుగా మారిన సమంతను.. కేసీఆర్ ప్రభుత్వం బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించిందని, రఘునందన్‌రావు గుర్తుచేయడం వ్యూహాత్మకంగానే కనిపిస్తోంది. సో.. కేటీఆర్‌నుద్దేశించి సురేఖ చేసిన వ్యాఖ్యలు, సమంతను కేసీఆర్ సర్కారు చేనేతకు బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించారన్న రఘునందన్‌రావు చేసిన తాజా వ్యాఖ్యలు జోడించి, సోషల్ మీడియాలో కొత్త కథనాలకు కారణమవుతున్నాయి.

ఈ నేపథ్యంలో హీరో నాగార్జున మరి, బీజేపీ ఎంపీ రఘునందన్ రావుపైనా పరువునష్టం దావా వేస్తారా? అన్న ఉత్కంఠకు తెరలేచింది. ఒక రకంగా రఘునందన్‌రావు వ్యాఖ్యలు, కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలంటే తీవ్రంగా ఉన్నాయని విశ్లేషిస్తున్నారు. ఎలాగూ మంత్రిగా ఉన్న సురేఖపైనే పరువునష్టం దావా వేసిన నాగార్జున, ఎంపి అయిన రఘునందన్‌రావుపై దావా వేసినా ఆశ్చర్యపోవలసిన పనిలేదంటున్నారు. అయితే వృత్తిరీత్యా బాగా ప్రాక్టీసు ఉన్న న్యాయవాది.. పైగా బీజేపీ ఎంపీ కూడా అయిన రఘునందన్ రావుతో పెట్టుకుంటే కష్టమైనందున, బహుశా ఆయనతో నాగార్జున లడాయి పెట్టుకోకపోవచ్చన్న అభిప్రాయం కూడా వ్యక్తమవుతోంది.

## దివికేగిన మానవతావాది
# రతన్ టాటాకు అశ్రునివాళి

న్యూఢిల్లీ,మహానాడు:

దిగ్గజ పారిశ్రామిక వేత్త, పద్మ విభూషణ్ గ్రహీత, టాటా సన్స్ గౌరవ చైర్మన్ రతన్ టాటా(86) బుధవారం రాత్రి కన్నుమూశారు. అనారోగ్య సమస్యల కారణంగా ముంబయి బ్రీచ్ క్యాండీ హాస్పిటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ లో చికిత్స పొందుతూ రాత్రి 11.30 గంటల సమయంలో ఆయన తుది శ్వాస విడిచారు. రతన్ టాటా మృతి పట్ల పలువురు ప్రముఖులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన వ్యాపార రంగంలో సాధించిన విజయాలను, సమాజానికి చేసిన సేవలను గుర్తు చేసుకుంటూ దేశం లోని రాజకీయ, సినీ రంగ ప్రముఖులు, వ్యాపార వేత్తలు ఘనంగా నివాళులర్పించారు.

### దేశం గర్వించదగ్గ పారిశ్రామికవేత్త రతన్ టాటా
- ప్రధాని నరేంద్ర మోదీ

దార్శనికులైన వ్యాపార దిగ్గజం, అసాధారణ మానవతా వాది అయిన రతన్ టాటా మనకు దూరం అయ్యారని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. భారీ లక్ష్యాలను ఊహించడం, ఆ ప్రతిఫలాలను సమాజానికి తిరిగి ఇవ్వడం రతన్ టాటా నైజం. విద్య, ఆరోగ్య సంరక్షణ, పారిశుద్ధ్యం, జంతు సంరక్షణ సేవల్లోనూ రతన్ టాటా ఎంతో ముందుడే వారని ప్రధాని మోదీ గుర్తు చేసుకున్నారు.

దేశంలోనే ఘన చరిత్ర కలిగిన ప్రతిష్ఠాత్మక వ్యాపార సామ్రాజ్యమైన టాటా గ్రూప్ నకు ఆయన ఎంతో స్థిరమైన నాయకత్వాన్ని అందించారని, బోర్డు రూం కార్యకలాపాలకు మించి దేశానికి అమూల్య సేవలందించారని ప్రధాని మోదీ అన్నారు.

### భారత్ గొప్ప దిగ్గజాన్ని కోల్పోయింది
- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

రతన్ టాటా మరణంతో భారత దేశం ఓ గొప్ప దిగ్గజాన్ని కోల్పోయిందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. దాతృత్వం, సేవా కార్యక్రమాల్లో ఆయన భాగస్వామ్యం నిరుపమానం అన్నారు.

### దేశ ముద్దు బిడ్డను కోల్పోయాం
- కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ

రతన్ టాటా మృతికి కాంగ్రెస్ నేత, లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సంతాపం వ్యక్తం చేశారు. వ్యాపారం, దాతృత్వంలో చెరగని గుర్తులను రతన్ టాటా మిగిల్చి వెళ్లిపోయారని పేర్కొన్నారు. రతన్ టాటా కుటుంబానికి, టాటా గ్రూప్ నకు సోషల్ మీడియా వేదికగా రాహుల్ గాంధీ సంతాపం తెలిపారు.

### నిజమైన మానవతావాదిని కోల్పోయాం:
- ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు

దార్శనికత, చిత్తశుద్ధితో ఈ ప్రపంచంపై చిరస్థాయిగా ముద్ర వేసిన తక్కువ మంది వ్యక్తుల్లో రతన్ టాటా ఒకరని ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు అన్నారు. కేవలం ఒక వ్యాపార దిగ్గజాన్నే కాదు.. నిజమైన మానవతావాదిని కోల్పోయాం. సామాజాన్ని మెరుగు పరిచేందుకు రతన్ టాటా నిరంతరం ప్రయత్నించారని, మానవీయత మూర్తీభవించిన అసాధారణ మనిషి ఆయన అని నారా చంద్రబాబు అన్నారు.

### ప్రపంచంలో తమదైన ముద్రం వేశారు
- తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి

వ్యాపార రంగంలో రతన్ టాటా పాటించిన విలువలు, సామాజిక సంక్షేమం కోసం ఆయన పడిన తపన స్ఫూర్తిదాయకం. సేవకు ఆయన ప్రతిరూపం అని తెలంగాణ సీఎం ఏ. రేవంత్ రెడ్డి అన్నారు.

# వైద్య సిబ్బంది పనివేళలు పాటించకపోవడంపై మంత్రి ఆగ్రహం

- పర్యవేక్షణ లోపాన్ని సవరించాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశం
- ఉన్నత స్థాయిలో పర్యవేక్షణ బాధ్యతను వైద్య ఆరోగ్య శాఖలోని హెచ్వోడీలకు అప్పగించిన మంత్రి
- హాజరు నమోదు చేసేందుకు రూపొందించిన యాప్ లను మరింత పటిష్టం చేయాలి



- పనివేళలు పాటించని సిబ్బందికి ఆటోమేటిక్ గా సమాచారం, షోకాజ్ నోటీసు జారీ
- పనివేళల పట్ల క్రమశిక్షణపై మూడు గంటల పాటు ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష

అమరావతి,మహానాడు:

ప్రజారోగ్యాన్ని కాపాడాల్సిన ప్రభుత్వ వైద్యులు, ఇతర సిబ్బంది నిర్ణీత పనివేళలు పాటించకపోవడంపై రాష్ట్ర వైద్య, ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఈ విషయంపై గురువారం సాయంత్రం మూడు గంటలకు పైగా మంత్రిత్వ శాఖలోని ఉన్నతాధికారులతో లోతుగా సమీక్షించారు. పనివేళల పట్ల నెలకొన్న క్రమశిక్షణా రాహిత్యం, దానిని అరికట్టేందుకు ప్రస్తుతం వివిధ స్థాయిల్లో చేపడుతున్న చర్యలు, పరిస్థితిని మెరుగుపర్చేందుకు ముమ్ముందు చేపట్టాల్సిన చర్యల గురించి వివరంగా చర్చించారు. ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణ బాబు, వివిధ శాఖాధిపతులు సమీక్షలో పాల్గొన్నారు. ఎక్కువ మంది క్రమశిక్షణ పాటిస్తున్నా కొంత మంది సిబ్బంది పనివేళలను ఉల్లంఘిస్తుండడంతో ప్రజారోగ్య వ్యవస్థకు చెడ్డ పేరు వస్తోందని మంత్రి అన్నారు.

వైద్యులు, ఇతర సిబ్బంది ఆలస్యంగా విధులకు రావడం, నిర్ణీత సమయానికంటే ముందే నిష్క్రమించడంపై ప్రసార మాధ్యమాల్లో తరచుగా వస్తున్న వార్తలు తనను ఆవేదనకు గురిచేస్తున్నాయని మంత్రి వ్యాఖ్యానించారు. వివిధ సమస్యలతో ప్రభుత్వాసుపత్రులకు వచ్చే రోగులకు వైద్యులు అందుబాటులో లేకపోతే వారెంతో ఇబ్బందులకు గురవుతారని, కనుక అందరూ పనివేళలను పాటించేలా తగు చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి అత్యున్నత ప్రభుత్వ సర్వ జన ఆసుపత్రులు వరకు వైద్యులు, సహాయక సిబ్బంది హాజరుపై పర్యవేక్షణ జరుగుతున్న తీరును చర్చించి ప్రస్తుత వ్యవస్థలో లోపాల్ని గమనించారు.

హాజరును దినవారీగా పరిశీలించి నిర్ణీత వేళల మేరకు విధులకు హాజరు కాని సిబ్బందిపై పటిష్టమైన పర్యవేక్షణ లేకపోతే ప్రభుత్వాసుపత్రులకు వచ్చే లక్షలాది ప్రజలకు తీవ్ర అన్యాయం చేసినవారమవుతామని మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆందోళ వెలిబుచ్చారు. క్రమశిక్షణ తప్పితే తగు కఠిన చర్యలు తీసుకోబడతాయన్న ఆలోచన ,భయం సిబ్బందిలో లేకపోతే పరిస్థితిలో మార్పు రాదని మంత్రి అన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వాసుపత్రుల్లో హాజరు విషయంలో నిత్య పర్యవేక్షణ చేయడం కోసం ఆ బాధ్యతను మంత్రి సత్యకుమార్ యాదవ్ మంత్రిత్వ శాఖలోని వివిధ శాఖాధిపతులకు అప్పగించి, వీలైనంత త్వరలో మార్పు తెచ్చేందుకు తగు చర్యల్ని చేపట్టాలని ఆదేశించారు.







# రతన్ టాటాకు క్యాబినెట్ నివాళి

- ఆయన మృతి దేశానికే తీరని లోటన్న సీఎం చంద్రబాబు

అమరావతి, మహానాడు:

దిగ్గజ వ్యాపార వేత్త రతన్ టాటా మృతికి ఏపీ క్యాబినెట్ సంతాపం తెలిపింది. రతన్ టాటా దేశానికి చేసిన సేవలను సీఎం చంద్రబాబు ఈ సందర్భంగా ప్రస్తావించారు.

విలువలతో కూడిన వ్యాపారంతో రతన్ టాటా ఒక పెద్ద బ్రాండ్‌ను సృష్టించారని ముఖ్యమంత్రి కొనియాడారు. సంపదను సృష్టించడమే కాకుండా... ఆ సంపదను సమాజంలో అన్ని వర్గాలకు చేరేలా పద్మవిభూషన్ రతన్ టాటా ఎంతో కృషి చేశారని అన్నారు. రతన్ టాటా మృతి పారిశ్రామిక రంగానికే కాకుండా దేశానికే తీరనిలోటని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు.

రతన్ టాటా మృతికి సంతాపంగా క్యాబినెట్ గురువారం రెండు నిముషాల పాటు మౌనం పాటించి నివాళులు అర్పించింది. రతన్ టాటా చిత్ర పటానికి పూలు వేసి ముఖ్యమంత్రి, మంత్రులు నివాళులు అర్పించారు.

అనంతరం సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ ముంబై బయలుదేరి వెళ్లారు.

# మన్మథ లీల.. 'కమలం' గోల

మొదటి పేజీ తరువాయి..

కొంపముంచిన సుకన్య అనే మహిళనే.. ఈ లేటెస్ట్ 'కమల శృంగారనైషధం'లోనూ కేంద్రబిందువు కావడం విశేషం.

పార్టీ వర్గాల సమాచారం ప్రకారం.. ఎన్నికల ముందు వరకూ వైసీపీలో కొనసాగిన సుకన్య అనే కార్యకర్త, ఆ తర్వాత బీజేపీలో చేరారు. ఆమె ఎవరి సమక్షంలో చేరారు? ఎవరు చేర్చారన్నది జిల్లా నేతలకు సమాచారం లేదు. ఆ తర్వాత బీజేపీలో చురుకుగా పనిచేస్తున్నారు. ఈ క్రమంలో ఇప్పటి జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర, అప్పటి అధ్యక్షుడు పాటిబండ్ల రామకృష్ణ ఆమెతో సన్నిహితంగా ఉండేవారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

ఈ నేపథ్యంలో ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన ఇద్దరు నాయకులకు, పాటిబండ్ల-వనమాకు పొసగేది కాదు. ఆ ఇద్దరు నాయకుల తీరుపై అప్పట్లో పాటింబడ్ల వర్గం రాష్ట్ర నాయకత్వానికి ఫిర్యాదు చేయడంతో, ఒక నేతను పదవుల నుంచి నాయకత్వం తప్పించింది. దానితో ఆయన తన మిత్రుడైన ఓ జిల్లా నేతతో కలసి, పాటిబండ్ల-వనమాను హానీట్రాప్ చేయించారన్న ప్రచారం పార్టీ వర్గాల్లో జోరుగా సాగుతోంది.

అందుకే ముందు సుకన్యతో.. వనమా మాట్లాడిన వీడియో లీక్ చే సిన ఆయన ప్రత్యర్ధి వర్గం, తాజాగా పాటిబండ్ల నగ్న వీడియో కూడా వ్యూహాత్మకంగా లీక్ చేయడం కలవరం సృష్టించింది. ఈ రెండు వీడియోలు సోషల్‌మీడియాలో వైరల్ కాగా, నాయకత్వం దిద్దుబాటుకు దిగక తప్పలేదు. వారిద్దరినీ పార్టీ పదవులకు రాజీనామా చేయమని ఆదేశించింది. దానితో ఇద్దరూ తమ పదవులకు రాజీనామా చేశారు. వారిద్దరితో వీడియోలో మాట్లాడిన సుకన్యను పార్టీ నుంచి సస్పెండ్ చేసింది.

కాగా మార్ఫింగ్- ఏఐ టెక్నాలజీ వాడి తనను అప్రతిష్ఠపాలు చేసిన వారిపై న్యాయపరమైన చర్యలు తీసుకుంటానని పాటిబండ్ల చెప్పారు. ఆ వీడియో తనది కాదన్నారు. పాటిబండ్ల వీడియోలో అవతలి మహిళ ఎవరన్నది కనిపించలేదు. అయితే బయటకొచ్చిన వనమా వీడియోలో అసభ్యకరమైన దృశ్యాలేవీ లేవు. 'ఇద్దరం కలసి మందుకొడదాం' అన్న మాటలే వినిపించాయి. అంటే దీన్నిబట్టి.. రికార్డు చేసిన పూర్తి వీడియో కాకుండా, ఎడిట్ చే సిన ఒక పార్టు మాత్రమే లీక్ చేశారని స్పష్టమవుతోంది.

అయితే బీజేపీ జిల్లా అధ్యక్షుడు వమనా, మాజీ అధ్యక్షుడు పాటిబండ్లతో మాట్లాడిన సుకన్య వీడియో.. బయటకు ఎలా లీకయిందన్న చర్చ పార్టీ వర్గాల్లో జరుగుతోంది. ఇదంతా రహస్య వ్యవహారం కాబట్టి, సహజంగా అలాంటి వీడియోను వారిద్దరూ రికార్డు చేసుకునే అవకాశం లేదు. ఒకవేళ సరదాకు, మధురజ్ఞాపకాల కోసం రికార్డు చేసుకున్నా దానిని ఎవరికీ పంపించరు. మరి ఆ వీడియో ఎలా లీకయింది?

అంటే వనమా-పాటిబండ్లతో వైరం ఉన్న ఆ ఇద్దరే, సుకన్య ద్వారా వారిని హానీట్రాప్ చేయించారా? ఆ ఇద్దరే పాటిబండ్ల-వనమా వీడియోలు లీక్ చేశారా? వనమా స్థానంలో తన మనిషిని జిల్లా అధ్యక్షుడిని చేయాలన్న వ్యూహంతోనే హానీట్రాప్ చేయించారా? అన్న చర్చ పార్టీ వర్గాల్లో జరుగుతోంది. ఇదీ.. గుంటూరు జిల్లాలో 'కమల శృంగార' కహానీ!

ఇప్పుడు వారిద్దరినీ పార్టీ పదవుల నుంచి తప్పించారు. బాగానే ఉంది. మరి ఎన్నికల ముందు ఒంగోలులో జరిగిన ఇలాంటి శృంగార ఘట్టంలో అడ్డంగా దొరికిపోయిన.. పాత్రధారి-సూత్రధారితో, ఎందుకు రాజీనామా చేయించలేదన్న చర్చకు తెరలేచింది. ఎన్నికల ముందు ఒంగోలు జిల్లాకు చెందిన ఓ అగ్రనేత.. జిల్లా పర్యటనకు వచ్చిన రాష్ట్ర కీలక నేత వద్దకు, మహిళామోర్చాకు చెందిన మహిళను 'శ్రమదానం' కోసం పంపించారు.

ఆర్థిక సమస్యల్లో ఉన్న ఆ నాయకురాలిని ఆదుకుంటానని హామీ ఇచ్చిన ఆ జిల్లా అగ్రనేత, తన జిల్లా పర్యటనకు వచ్చిన రాష్ట్ర కీలక నేత బస చేసిన హెూటల్‌కు పంపించారు. అయితే సదరు జిల్లా నేత, తనకు చేస్తానన్న ఆర్థికసాయం ఎంతకూ చేయకపోవడంతో.. ఆ మహిళా కార్యకర్త ఆవేదనతో ఒక వీడియో విడుదల చేసింది. ' ఆ జిల్లా నాయకుడు పదవి కోసం తనను రాష్ట్ర కీలక నేత వద్దకు పంపించాడ'ని, ఆయన పేరు కూడా వెల్లడించింది.

అలా రాష్ట్ర నేతల వద్దకు మహిళలను పంపించడం ఆ జిల్లా నేతకు అలవాటేనని, అయితే మహిళల అవసరాన్ని వాడుకునే ఆ జిల్లా నేత చేసిన అన్యాయాన్ని గుర్తించి, తనకు న్యాయం చేయమని నేరుగా రాష్ట్ర నాయకత్వానికే ఆ వీడియో పంపింది. ఇది బీజేపీ రాష్ట్ర నేతలు, ఒంగోలు జిల్లా నేతలకు తెలిసిన వ్యవహారమే. వాటికి సంబంధించిన ఆడియో-వీడియో అందరి ఫోన్లకూ చేరాయి.

తర్వాత ఎన్నికల ముందు విజయవాడలో జరిగిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గం, జిల్లా అధ్యక్షుల సమావేశానికి హాజరైన జాతీయ నేతల దృష్టికి, ఆ వ్యవహారం వెళ్లడంతో ఆ వీడియోపై చర్చ జరిగింది. దానిపై నివేదిక ఇవ్వాలని జాతీయ నేతలు ఆదేశించారు. అయితే ఇప్పటికీ దానిపై జాతీయ పార్టీకి నివేదిక పంపిన దాఖలాలు లేవు. విచిత్రంగా.. తర్వాత ఆ రాష్ట్ర నేతకు జాతీయ నాయకుడిగా ప్రమోషన్ రాగా.. ఆయనకు మహిళానేతతో 'శ్రమదానం' చేయించిన ఒంగోలు నేతకూ, జిల్లా స్థాయి ప్రమోషన్ లభించడం విశేషం. అయితే ఆ వీడియోనే సదరు రాష్ట్ర నేతకు, ఆయన కలలుకన్న ఎంపీ టికెట్ రాకుండా కొంపముంచిందన్న ప్రచారం లేకపోలేదు. ఆ వీడియోను 'పైకి' పంపించిన ఓ రాష్ట్ర కీలక నేత లక్ష్యం కూడా నెరవేరింది.

తాజా గుంటూరు జిల్లా అగ్రనేతలతో రాజీనామా చేయించిన నేపథ్యంలో, ఈ పాత కథ కొత్తగా చర్చల్లోకి వచ్చింది. ఆ జాతీయ నాయకుడితో రాజీనామా చేయించని రాష్ట్ర నాయకత్వం.. జిల్లా నేతలతో మాత్రం ఎలా రాజీనామాకు ఆదేశిస్తుందన్న లా పాయింట్‌పై చర్చ జరుగుతోంది. కాగా తాడేపల్లిగూడెంలో వెలుగుచూసిన.. పార్టీకి పెద్ద దిక్కులాంటి ఓ సీనియర్ నేత 'శృంగారనైషధం' కూడా, అప్పట్లో చర్చనీయాంశమయిన విషయం తెలిసిందే. దేశం కోసం-పార్టీ కోసం జీవితాన్ని త్యాగం చేస్తున్నామని 'ప్రచార'ం చేసుకునే, ఇలాంటి 'ప్రముఖు'ల చీకటి రహస్యాలు.. ఇలాంటి సందర్భాల్లో వెలుగులోకి వస్తుండటం, పార్టీ సంప్రదాయవాదులకు వేదన కలిగిస్తోంది.

గతంలో రాష్ట్ర పార్టీకి పెద్ద దిక్కుగా ఉన్న ఒక సీనియర్ నేతపై కూడా.. ఇలాంటి 'మానవ బలహీనతలకు సంబంధించిన ఆరోపణలు' రావడంతో, ఆయనను ఉత్తరాదికి బదిలీ చేయాల్సి వచ్చింది. ఒకప్పుడు జాతీయ స్థాయిలో ఒక వెలుగువెలిగిన ఓ తెలుగుతేజం.. ఇలాంటి 'మానవ బలహీనత'లకు సంబంధించిన ఆరోపణలు- ఫిర్యాదులతోనే సుదీర్ఘకాలం తెరమరుగై.. మళ్లీ ఇటీవల జరిగిన రెండు రాష్ట్రాల ఎన్నికల్లో, తెరపైకి రావడాన్ని పార్టీ వర్గాలు గుర్తుచేస్తున్నాయి.

ఇప్పుడు రాష్ట్ర కమిటీలో కీలక పదవిలో ఉన్న ఓ నేతకు 'మహిళానేత' అన్న పేరుంది. అమలాపురం,కాకినాడ ప్రాంతాల్లో ఆయనపై చాలామంది మహిళలు ఫిర్యాదు చేయడం, అప్పటి రాష్ట్ర అధ్యక్షుడు వాటిని సెటిల్‌మెంట్ చేసిన వైనాన్ని గోదావరి జిల్లా బీజేపీ నేతలు గుర్తు చేస్తున్నారు. ఇక చాలాకాలం క్రితం ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన ఓ నేత వివాహితను తీసుకువెళ్లారంటూ.. స్వయంగా ఆమె భర్త, ఢిల్లీ పార్టీ ఆఫీసు ఎదుటే ధర్నా చేసిన వైనాన్ని గుర్తు చేస్తున్నారు. ఇప్పటికీ ఆమె కనిపించకపోవడం విశేషం.

సిద్ధాంతాల పునాదులు, సంస్కృతీ సంప్రదాయాల ఇటుకలపై నిర్మించిన బీజేపీలో.. ఇలాంటి అనైతిక చర్యలు పెరిగిపోవడానికి కారణమేమిటన్న దానిపై, జాతీయ నాయకత్వం ఇప్పటిదాకా దృష్టి సారించకపోవడమే విచిత్రం. ఫలితంగా మిగిలిన పార్టీలకూ- బీజేపీకి తేడా లేదన్న భావన.. ప్రజల్లో స్థిరపడేందుకు కారణమవుతోందన్న ఆవేదన, పార్టీ శ్రేణుల నుంచి వ్యక్తమవుతోంది.

# సనాతన ధర్మానికి బ్రాండ్ అంబాసిడర్ పవన్ కల్యాణ్

మొదటి పేజీ తరువాయి..

సనాతన ధర్మ వేద సంపద అమూల్యమైనది. వేదం అనే పదం, సంస్కృత పదం 'విద్' అనే ధాతువుకు 'తెలి యుట' అన్న అర్థం పుట్టింది. వేదములు సృష్టికి ముందు నుండే ఉండి, కాలక్రమేణా భగవంతుని ద్వారా మహ ర్షులకు వారి ధ్యాన, తపో బలముల వలన 'తెలుప బడినవి' అని, అవి ఏ మానవుల చేతనూ రచింపబడలేదు అని విశ్వాసము.

కనుకనే వేదాలను 'అపౌరుషేయములు' అని కూడా అంటారు. అంటే మానవ మాత్రుడు చెప్పింది కాదు అని అర్థం. వేదములను తెలుసుకున్న ఋషులను, ద్రష్టలు అని అంటారు. ద్రష్ట అంటే దర్శించినవాడు అని అర్థం.

సనాతన ధర్మ శాస్త్రాలప్రకారం, వేదాలను ఋషులు భగవంతుని నుండి విని గానం చేశారు. అందుకే వీటిని శ్రుతులు అని అంటారు. ఈ వేదాలు – వేదాంత శాస్త్రం, తత్వశాస్త్రం, పురాణాలు, ధర్మాన్ని ఆచరించడానికి కావలసిన లోతైన జ్ఞానాన్ని అందిస్తాయి.

వర్ణ ఆశ్రమ ధర్మం – వేదాలను అనుసరించి సంప్రదాయ సనాతన సమాజం నాలుగు వర్ణాలుగా విభజించబడింది. అవి:

బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర

– భగవద్గీత బోధన అప్పుడు కూడా శ్రీ కృష్ణుడు "చాతుర్వర్ణ్యం" అని పలికాడు. జన్మతః / పుట్టుకతో ప్రతి ఒక్కరు శూద్రులు అంటే సామాన్యులు. వారివారి గుణ గణాలను బట్టి వర్ణం వర్తిస్తుంది.

– సంస్కారం లేదా అభ్యాసం వల్ల ద్విజులు అంటే వృత్తిదారులు. వృత్తి ద్వారా వ్యాపారాలు సాగించేవారు కాబట్టి వైశ్యులు అవుతారు.

– విద్య వల్ల విప్రులు అంటే విద్వాంసులు. రాజ్య పాలన చేయు నైపుణ్యం సంపాదించుట వలన క్షత్రియులు. భుజ బలంతో, క్షత్ర వీర్యంలో రాజ్య పాలన చేయగలరు నాలుగు వర్ణాలలో ఎవరికి పుట్టినా సరే క్షత్రియుడే అవుతాడు.

– బ్రహ్మ జ్ఞానం వల్ల బ్రాహ్మణులు. బృహత్వం అంటే బ్రహ్మ విద్య నేర్చిన వాడు మరియు అనునిత్యం వేద ధర్మాలను పాటిస్తూ బ్రహ్మ (వేద) కర్మలను చేయువాడు. అలాంటి వారు మాత్రమే బ్రాహ్మణులు

అన్న వివరణతో మనుష్యుల్లోని నాలుగు విభాగాల్ని సూచించే మాట "చాతుర్వర్ణ్యం". విభజించేందుకు ఉపయోగించే నాలుగు విభాగాలను సూచించే పదం వర్ణం. ఈ వర్ణక్రమం వ్యక్తిగత, సామాజిక జీవితాల



స్థితిగతులను తెలియచేస్తుంది.

ఆశ్రమం అంటే నివసించే ప్రదేశం లేదా నిలయం. ఆశ్రమ ధర్మం అనేది మనిషి జీవితంలోని నాలుగు దశలను తెలియకుండా చేస్తుంది. అవి:

– బ్రహ్మచర్యం – ఇంద్రియ నిగ్రహము ఆచరించి, పెద్దల పట్ల గౌరవము, గురువుల యందు భక్తి, శ్రద్ధలతో విద్య నేర్చుకొను దశ.

– గృహస్థం – తల్లి, తండ్రి సేవ చేస్తూ ఏకపత్ని వ్రతుడుగా ధర్మ సంతానము కలిగి, అతిధి మర్యాదలు పాటిస్తూ ఆచార వ్యవహారములు నడిపించు దశ.

– వానప్రస్థం – వయో భారాన్ని దృష్టిలో ఉంచుకొని, కర్మల యందు వాంఛ వీడి సంతానమునకు వ్యవహారములు అప్పగించే దశ.

– సన్యాసం – మోక్ష ప్రాప్తి కోసం ఎదురు చూస్తూ అధ్యాత్మిక చింతనతో భగవంతుడిని స్మరించుకుంటూ జీవనం సాగించే దశ.

మనిషి ఎప్పుడు, ఏమి చేయాలి అనేది కేవలం మనిషి ఆత్మస్థితిని బట్టి కాకుండా దేహ వయోస్థితి మీద కూడా ఆధార పడి ఉంటుంది. అందుకే వర్ణ ఆశ్రమ ధర్మం అని పిలుస్తారు.

### కులం అంటే వంశం

ఉదాహరణకు: ఇక్ష్వాకు కుల తిలక – అంటే : ఇక్ష్వాకు వంశోద్ధారకా అని అర్థం.

తమలో తాము వివాహాలు చేసుకుంటూ, ఒక విధమైన జీవన సరళిని కొనసాగిస్తూ వచ్చిన సామాజిక వర్గాలకు కులాల పేరు. వృత్తి, ఆచారాలు, సామాజిక స్థాయి వంటి అనేకాంశాలు కులాల్లో పరంపరగా కొనసాగేవి. వంశపార పర్యంతం పాటించబడే ఒక సామాజిక ఆచారం. నిజానికి గోత్ర నామాలే ఇంటి పేర్లు. అదే ఒక వ్యక్తి వంశాన్ని తెలియచేస్తుంది. ఇప్పుడు అమలో ఉన్న ఇంటి పేర్లు అనేవి ఊరు పేరు లేదా వివిధ కారణాల చేత సృష్టించబడినవి మాత్రమే.

ఒక వ్యక్తి చేసే పని ఆధారం చేసుకొని, అతనికి ఒక వర్ణం కేటాయించబడింది. అలా అలాంటి పనే చేసే వాళ్ళని అందరిని కలిపి వర్గీకరించారు. ఆ వర్గం ఆ పనిలో నిష్ణాతులు కాబట్టి ఆ వర్గంలోని వారు తమ పిల్లలకు అదే పని నేర్పడానికి కారణం, వారికి ఉపాధిని కలిగించే విద్య నేర్పించాలి. అంటే విద్య నేర్పిన గురువుకు ధనం రుసుముగా చెల్లించాలి.

కావున ఆర్థిక స్థోమత లేకపోవడం చేత తాము నిష్ణాతులైన వారికి కనీసం ఆ పనిని నేర్పించండి. కానీ ఆ పని చేసి బ్రతుకుతారు అని కాదు. కొంతమంది తమ స్వార్థ స్వప్రయోజనాల కోసం వర్ణ వ్యవస్థను కాస్త ఈ రోజు భారత దేశ సమాజాన్ని పట్టి పీడిస్తున్న కుల వ్యవస్థగా మార్చి సనాతన ధర్మం గొప్పతనాన్ని నాశనం చేశారు.

ఒక మనిషి పుట్టుక కాదు. అతని గుణ, గణాలు నిర్ణయిస్తాయి. అతను ఏ వర్ణ వ్యవస్థకి చెందుతాడో. ఒక మనిషికి పుట్టిన అంత మాత్రాన రాజు, బ్రాహ్మణుడికి పుట్టిన అంత మాత్రాన బ్రాహ్మణుడు కాలేడు. దానికి "పండిత పుత్ర పరమ శుంఠ హ !" అనే నానుడి ఒక గొప్ప ఉదాహరణ.

వర్ణ వ్యవస్థ మనిషి చేసే పనిని, కుల వ్యవస్థ మనిషి పుట్టుక(వంశం) తెలియకుండా చేస్తుంది.

హిందూ సనాతన ధర్మం' అంటూ ఏమీ లేదు. అది 'సనాతన ధర్మం' అంతే. 'సనాతన' అంటే, శాశ్వతమైనదని అర్థం. శాశ్వతం అంటే ఎప్పటికీ ఉండే సత్యం అని అర్థం.

ఈ ఉనికికే ఆధారమైన సనాతన ధర్మం అనేది, జీవితంలోని ఎప్పటికీ మారని పార్శ్వానికి సంబంధించింది. ఒక వానపాము, కీటకం, పక్షి లేదా ఒక మొక్క, ఏదైనా సరే, అన్నిటికీ ఈ ఉనికికి వర్తించే ప్రాథమిక నియమాలే వర్తిస్తాయి. అదే సనాతన ధర్మం.

మనిషిపై మనిషి నియంత్రణ కోసమో, సమానత్వం కోసమో సంఘంలో పెట్టుకున్న శిక్షాస్మృతులు కావు ఇవి. ఎందుకంటే, ఆ లావాదేవి చట్టాలు తరతరానికీ మారిపోవాల్సి ఉంటుంది. అది వేరే విషయం. మనం మాట్లాడేది లావాదేవిచట్టం గురించి కాదు. మనం మాట్లాడేది ఎప్పటికీ నిలిచి ఉండే ధర్మం గురించి. మీరెక్కడున్నా భారతీయుడైనా, హిందువైనా కాకున్నా సనాతన ధర్మం అందరికీ వర్తిస్తుంది. ముందుగా మనం ధర్మం అనే పదాన్ని అర్థం చేసుకుందాం. ధర్మం అంటే, నియమం. ధర్మం అంటే, మతం కాదు. ఈ సంస్కృతిలో మనకి మతం అంటే ఏమిటోటో తెలియదు. మనకి తెలిసిందల్లా, మన జీవితం ఉత్తమంగా నడవటానికి, అంతర్లీనంగా ఉన్న నియమాలు మాత్రమే.

ఎందుకంటే, ఆ నియమాలకి కట్టుబడి ఉండకపోతే, మన జీవితం సరిగ్గా సాగదని మనం అర్థంచేసుకున్నాము. ఈనియమాలు మన మీద ఆపాదించినవి కావు. అవి మన ఉనికికి ఒక పునాది, ఒక ఆధారం. మీరు వీటిని సరిగా అర్థం చేసుకుంటే, జీవితం హాయిగా సాగిపోతుంది. ఎందుకంటే, మీకు ఎలా ఉండాలో తెలిసింది కనుక.. దానికి మీరు కట్టుబడి ఉంటారు కనుక. మీకు అది తెలియకపోతే మాత్రం, అనవసరంగా మీరు ఇబ్బంది పడతారు.

సనాతన ధర్మం హిందువులకి సంబంధించిందా? భారతీయులకి సంబంధించిందా? లేదా ఇంకొకరికి సంబంధించిందా? – అది కాదు అసలు విషయం. మీరు ఎక్కడున్నా, మీరు భారతీయులైనా, హిందువులైనా, వేరేమతస్తులైనా, మీరుఇంకేదైనా, సనాతన ధర్మం అందరికీ వర్తిస్తుంది. ఎందుకంటే ఈ నియమాలు మన ప్రాథమిక జీవ ప్రక్రియకుమార్గదర్శకాలు.

ఏ సంస్కృతీ కూడా దీనివైపు, మనం చూసినంత లోతుగా చూడలేదు. అందుకే మనం, గొప్పగా, ఇది 'హిందూ సనాతన ధర్మం' అని అంటూ ఉంటాము. కానీ మనం ఈ రోజున 'హిందు' అనే పదం వాడి, సనాతన ధర్మం యొక్క విస్తృతిని తగ్గిస్తున్నాము.

హిందు అనబడేది భౌగోళిక గుర్తింపు. హిందుమహాసముద్రానికీ- హిమాలయాలకీ మధ్య ఉన్న భూభాగమే 'హిందు'. సనాతన ధర్మం ప్రతి జీవికీ వర్తిస్తుంది.సనాతన ధర్మం జీవితంలో వివిధ అంశాలను, పుట్టబోయేవారిని, పుట్టిన వారిని, ఎదిగిన వారిని, జీవితంలో వివిధ దశల్ని, చివరికి చనిపోయిన తర్వాత కూడా ఎలా నిర్వహించుకో వాలో తెలుపుతుంది.

జనం గుండె చప్పుడు
3
మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || శుక్రవారం 11, అక్టోబర్ 2024 ||

# తెలంగాణ భవన్‌లో జమ్మి చెట్టు

హైదరాబాద్,మహానాడు: గ్రీన్ ఇండియా ఛాలెంజ్ ఆధ్వర్యంలో రాజ్యసభ మాజీ సభ్యులు జోగినపల్లి సంతోష్ కుమార్ కార్యక్రమంలో భాగంగా తెలంగాణ భవన్‌లో జమ్మి చెట్టును నాటిన పార్లమెంట్ మాజీ సభ్యులు వినోద్ కుమార్.

ఈ సందర్భంగా మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణతో పాటు, హిందూ సంస్కృతి సంప్రదాయాలలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న జమ్మి చెట్టును ప్రతి గుడి ఆవరణలో నాటాలని కోరారు. ఇంత మంచి కార్యక్రమం చేపట్టిన మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్ ఇలాంటి ఎన్నో కార్యక్రమాలు తలపెట్టాలని కోరారు.

ఈ కార్యక్రమంలో రాజ్య సభ మాజీ సభ్యులు రావుల చంద్ర శేఖర్ రెడ్డి ,గ్రీన్ ఇండియా ఛాలెంజ్ కో ఫౌండర్ రాఘవ, సభ్యులు గర్రెపల్లి సతీష్, ఎన్ ఎన్ రాజు. బీసీ కమిషన్ మాజీ సభ్యులు శుభ ప్రద్ పటేల్, కిషోర్



గౌడ్,కార్పొరేషన్ మాజీ చైర్మన్ దూది మెట్ల బాలరాజు, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి సోమ భరత్ కుమార్ ,బి ఆర్ ఎస్ వి అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్, పల్లె రవికుమార్ ,బొమ్మెర రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# పరిహారం కాదు..పరిహాసం

- రైతాంగాన్ని...వంచనతో మళ్లీ ముంచిన సర్కారు
- భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్,మహానాడు: లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతింటే.. వేల ఎకరాలకే అరకొర సాయం చేసి చేతులు దులుపుకోవడం అన్యాయం. 4.15 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని స్వయంగా ముఖ్యమంత్రి చెప్పిన మాటలు.. వ్యవసాయ శాఖ ఇచ్చిన నివేదిక వాస్తవం కాదా?

పంట నష్టం అంచనాలను తల్లకిందులుగా ఎందుకు మార్చేసారు..? ఏకంగా 3లక్షల 35 వేల ఎకరాలు ఎట్లా ఎగిరిపోయాయి..? 79,574 ఎకరాలకే కంటి తుడుపుగా పరిహారం ఇచ్చి మమ అనిపించడం దారుణం.

అపార నష్టంతో అల్లాడుతున్న రైతుల ఆదుకునే విషయంలోనూ ఉదారంగా వ్యవహరించలేరా? మానవత్వం ప్రదర్శించలేరా? 5.20 లక్షల ఎకరాల్లో పంటకు నష్టం వాటిల్లిందని కేంద్ర బృందానికి రాష్ట్రం రిపోర్ట్ ఇచ్చింది నిజం కాదా? ఇప్పుడు ఇంత భారీ కోతలా?

పెట్టిన పెట్టుబడి కొట్టుకుపోయి...రాళ్లు ఇసుక మేటలు వేసిన పొలాలను బాగుచేసుకోవడానికి మీరిచ్చే 10వేలు ఏమూలకూ సరిపోవు..మరి అందులోనూ కుదింపులు చేయడం ఏమాత్రం సమంజసం కాదు.

అన్నదాత ఆపదలో వున్నప్పుడు ఆదుకోవడం.. ప్రభుత్వాల బాధ్యత..! ఆ బాధ్యత నుంచి తప్పించుకోకుండా నష్టం వాటిల్లిన ప్రతి ఎకరానికి పరిహారం



అందించండి.

రుణమాఫీలో దగా జరిగింది..రైతు భరోసా జాడా పత్తా లేదు..వరదలు ముంచెత్తి నష్టాల్లో..కష్టాల్లో కూరుకుపోయిన రైతులకు అండగా నిలవట్లేదు..! అన్నదాతపై ఎందుకీ వివక్ష?



# పవన్ కళ్యాణ్‌కు అస్వస్థత

అమరావతి,మహానాడు: డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మరోసారి అస్వస్థతకు గురయ్యారు. జలుబు, దగ్గు, జ్వరంతో బాధపడుతున్నారు. ఈ కారణంగానే ఇవాళ క్యాబినెట్ సమావేశానికి ఆయన హాజరుకాలేదు. ఇటీవల తిరుమలకు కాలినడకన వెళ్లిన ఆయన అనారోగ్యానికి గురైన విషయం తెలిసిందే. జ్వరంతో బాధపడుతూనే వారాహి సభలో పాల్గొన్నారు.

# రాష్ట్ర పండగగా వాల్మీకి జయంతి

- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత
- ఈనెల 17న రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించాలని ఆదేశం
- అన్ని జిల్లాలోనూ...కలెక్టర్ల నేతృత్వంలో నిర్వహణ
- రాష్ట్ర స్థాయిలో అనంతపురంలో పకడ్బందీగా నిర్వహించాలన్న మంత్రి సవిత

అమరావతి,మహానాడు: ఈ నెల 17వ తేదీన వాల్మీకి జయంతిని రాష్ట్ర పండగగా నిర్వహించాలని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రివర్యులు ఎస్.సవిత ఆదేశించారు. అన్నజిల్లా కేంద్రాల్లోనూ కలెక్టర్ల నేతృత్వంలో నిర్వహించాలన్నారు. రాష్ట్ర స్థాయిలో అనంతపురంలో వాల్మీకి జయంతిని నిర్వహించాలని, ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని స్పష్టంచేశారు. గురువారం రాష్ట్ర సచివాలయంలోని నాలుగో బ్లాక్ లో ఉన్న తన కార్యాలయంలో బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి పోలా భాస్కర్, ఆ శాఖాధికారులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, వాల్మీకి జయంతిని రాష్ట్ర పండగగా, అధికారికంగా నిర్వహించాలని సీఎం చంద్రబాబునాయుడు ఆదేశించారన్నారు. సీఎం ఆదేశాల మేరకు అన్ని జిల్లా కేంద్రాల్లోనూ కలెక్టర్ల నేతృత్వంలో వాల్మీకి జయంతి నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకు కలెక్టర్లకు



ఆదేశాలు జారీచేయాలని బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి పోలా భాస్కర్ ను మంత్రి ఆదేశించారు.

రాష్ట్ర స్థాయిలో వాల్మీకి జయంతిని అనంతపురంలో అదే రోజు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఇందుకు భారీ ఏర్పాట్లు చేయాలన్నారు. ఆనందోత్సవాల నడుమ వాల్మీకి జయంతి నిర్వహించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారన్నారు. అనంతరం బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి పోలా భాస్కర్ మాట్లాడుతూ, వాల్మీకి జయంతిని అధికారికంగా నిర్వహించేలా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేయనున్నట్లు తెలిపారు.





# పిఠాపురం సి.హెచ్.సి.లో వైద్యులు, సిబ్బంది నియామకం

- ఎక్స్ రే యూనిట్ పునరుద్ధరణ
- ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రత్యేక దృష్టి..అధికారులతో సమీక్ష

పిఠాపురం,మహానాడు: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తన నియోజకవర్గం పిఠాపురంలో సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులతో సమీక్షలు నిర్వహిస్తున్నారు. అధికారుల బృందాన్ని పిఠాపురం నియోజకవర్గానికి పంపించి క్షేత్ర స్థాయిలో ఉన్న సమస్యలపై పరిశీలన చేయించి నివేదికలు పరిశీలిస్తున్నారు.

ఇందులో భాగంగా పిఠాపురంలోని కమ్యూనిటీహెల్త్‌సెంటర్ (సి.హెచ్.సి.)లో వైద్యులు, సిబ్బంది కొరత, ఎక్స్ రే యూనిట్ పని చేయకపోవడాన్ని గుర్తించారు. దీనిపై కాకినాడ జిల్లా కలెక్టర్, డి.ఎం.అండ్ హెచ్.ఓ.లతో చర్చించారు. తక్షణమే పిఠాపురం సి.హెచ్.సి.లో వైద్యులను, సిబ్బందిని నియమించాలని ఆదేశించారు.

నియోజకవర్గంలో పెద్ద ఆసుపత్రి అయిన సి.హెచ్.సి.లో మెరుగైన వైద్య సేవలు అందించాలని, రోగులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురు కాకూడదని స్పష్టం చేశారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశాలకు అనుగుణంగా సివిల్ అసిస్టెంట్ సర్జన్, మెడికల్ ఆఫీసర్‌లను పిఠాపురం సి.హెచ్.సి.లో నియమించారు.

ముగ్గురు స్టాఫ్ నర్సులను, ఒక జనరల్ డ్యూటీ అటెండెంట్ లను నిర్ణయించారు. అదే విధంగా ఎక్స్ రే యూనిట్‌ను పునరుద్ధరించారు. ఈ యూనిట్ సేవలు అందుబాటులోకి తీసుకువచ్చారు.

## రేవంత్ రెడ్డి ప్రకటనలు

# నమ్మే పరిస్థితి లేదు

- ఎస్సీ వర్గీకరణను అమలు చేయకుండానే 11 వేలకు పైగా ఉపాధ్యాయ నియామకాలు భర్తీ చేశారు
- 16న వరంగల్‌లో ఎమ్మార్పీఎస్ భారీ సమావేశం

హైదరాబాద్,మహానాడు: రేవంత్ రెడ్డి ప్రభుత్వం కూడా నిర్బంధాలతోనే నడుస్తోందని ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ విమర్శించారు. మాదిగలను నమ్మించేందుకు రేవంత్ రెడ్డి ఎన్నో ప్రకటనలు చేస్తున్నారని, కానీ వాటిని నమ్మే పరిస్థితి లేదన్నారు. ఎస్సీ వర్గీకరణను అమలు చేయకుండానే 11 వేలకు పైగా ఉపాధ్యాయ నియామకాలు భర్తీ చేశారన్నారు. ముఖ్యమంత్రి అసెంబ్లీలో చెప్పిన మాటలకే విలువ లేకుండా పోయిందన్నారు.



సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో, ఇప్పటికే ఇచ్చిన నోటిఫికేషన్లకు కూడా వర్గీకరణను వర్తింపజేస్తామని చెప్పిన రేవంత్ రెడ్డి, అమలు చేయకుండానే పోస్టులను భర్తీ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

గ్రూప్ 1, గ్రూప్ 2 పరీక్షలకు వర్గీకరణను వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే వర్గీకరణ తర్వాతే పరీక్షలు నిర్వహించాలన్నారు.

గ్రూప్ 4 ఫలితాలు ఇప్పటికే 16 నెలలు ఆగిపోయాయని, వర్గీకరణ జరిగే వరకు మరో రెండు నెలలు వాయిదా వేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ నెల 16న వరంగల్‌లో భారీ సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు.

# మార్కెటింగ్‌లో రేవంత్‌ను మించినోడు లేడు

- రేవంత్‌కు ఎన్ని నాలుకలు ?
- కోదండరాం సెక్రటేరియట్ వెళ్లి ఖాళీలు గుర్తించి సీఎం కు జాబితా ఇవ్వొచ్చు కదా ?
- మాజీ ఎంపీ బి.వినోద్ కుమార్

హైదరాబాద్, మహానాడు: సీఎం రేవంత్ రెడ్డి, ఆయన మంత్రివర్గ సహచరులు కేసీఆర్ హయం లో ఉద్యోగాలు ఇవ్వలేనట్టు మాట్లాడారు. ఉపాధ్యాయుల నియామకాల ప్రోగ్రాంను సీఎం రాజకీయ వేదికగా వాడుకున్నారు. కేసీఆర్ కుటుంబ సభ్యుల ఉద్యోగాలు తీసేస్తే మీకు ఉద్యోగాలు వచ్చాయి అని రేవంత్ రెడ్డి ఉపాధ్యాయుల నుద్దేశించి అన్నారు.

కేసీఆర్ హయం లో రికార్డు స్థాయి లో ఉద్యోగాలు ఇచ్చాం ..మేము సరిగా చెప్పుకోలేకపోయాం. మార్కెటింగ్ లో రేవంత్ ను మించినోడు లేడు. తన usp రియల్ ఎస్టేట్ అని రేవంత్ తనకు తానే ఒక ఇంటర్వ్యూ లో చెప్పుకున్నారు. ఆలా చెప్పుకున్న వారు మార్కెటింగ్ లో ఎలా ఉంటారో తెలియదా ?

లక్షా 62 వేల ఉద్యోగాలు కేసీఆర్ హయంలో ఇచ్చాము. మంత్రులుగా ఉన్న భట్టి, పొన్నంలకు తెలియకపోతే వారు మంత్రులుగా ఉండటానికి అనర్హులు. కేసీఆర్ ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో చెప్పాలి అని మంత్రులు అడుగుతున్నారు. వారికి తెలియదా? రేవంత్ రెడ్డి ఇప్పటి వరకు ప్రభుత్వ శాఖల్లో ఎన్ని ఉద్యోగాలు ఖాళీ ఉన్నాయో నిర్ధారించారా చెప్పాలి.

నిన్న మీరు ఇచ్చిన ఉపాధ్యాయ నియామకాలు కూడా సెప్టెంబర్ 6,2023 నాడు ఇచ్చిన నోటిఫికేషన్‌కు కొనసాగింపే. కేవలం ఆరు వేల ఉద్యోగాలు నోటిఫికేషన్‌లో అదనంగా కలిపారు.



కోర్టు కేసులను పరిష్కరించింది కేసీఆర్ ప్రభుత్వమే. అందుకే ఆరవై రోజుల్లో ఉపాధ్యాయ నియామకాలు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చింది.

ఇపుడున్న సీ ఎస్ కు అధికారులకు అన్ని విషయాలు తెలుసు. డిసెంబర్ 31 ,2024 లోగా 2 లక్షల ఉద్యోగాలు ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చి తీరాలి. రిక్రూట్ మెంట్ సైకిల్ లో భాగం గా మొదట ఉద్యోగ ఖాళీలు గుర్తించాలి ..ఆ పనే జరగలేదు. కోదండరాం ఏం చేస్తున్నారు ..సెక్రటేరియట్ వెళ్లి ఖాళీలు గుర్తించి సీఎం రేవంత్ కు జాబితా ఇవ్వొచ్చు కదా ?

నిరుద్యోగులతో సభ పెట్టి ఎన్ని ఖాళీలు ఉన్నాయో రేవంత్ చెప్పాలి. నాకు ఓడిపోతే కేసీఆర్ ఉద్యోగం ఇచ్చారని రేవంత్ మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో ఆరంభం నుంచి నేను ఉన్నాను. నా చరిత్ర అందరికీ తెలుసు.పదవుల కోసం ఏనాడు పాకులాడలేదు. తెలంగాణ ఉద్యమం పై తుపాకీ పెట్టిన రేవంతా నా గురించి మాట్లాడేది?

**నా గురించి సీఎం హేళనగా మాట్లాడారు కనుకే స్పందిస్తున్నా.**

కేసీఆర్ ఉద్యోగాలు ఇచ్చినా మేము హంగామా ప్రచారం చేసుకోలేదు. మేము ఉద్యోగాలు ఇస్తే నియామక పత్రాలు పోస్టులో వెళ్ళేవి. ఇపుడు ఎల్బీ స్టేడియంలో ఇస్తున్నారు. మేమిచ్చిన నోటిఫికేషన్లకు ఉద్యోగాలు ఇచ్చి ప్రచారం చేసుకుంటున్నారు. 2 లక్షల ఉద్యోగాలు ఇచ్చాక ప్రచారం చేసుకోండి.

కేసీఆర్ వల్లే తెలంగాణ వచ్చిందన్న రేవంత్ ఇపుడు కొరివి దయ్యం అంటున్నారు. రేవంత్ కు ఎన్ని నాలుకలు ఉన్నాయి ? లక్షా 62 వేల ఉద్యోగాలు కేసీఆర్ నింపలేదని ఆర్థిక మంత్రిగా ఉన్న భట్టి చెప్పగలరా ?

# ప్రపంచ స్థాయి వేదికపై తెలంగాణ టూరిజం ప్రమోషన్

- ఐఎంఇఎక్స్ అమెరికా 2024 ట్రేడ్ షోలో తెలంగాణ టూరిజం స్టాల్ ఏర్పాటు
- పాల్గొన్న పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

హైదరాబాద్, మహానాడు: లాస్ వెగాస్‌లోని మాండలే బేలో నిర్వహించిన IMEX అమె రికా 2024" ట్రేడ్ షో లో తెలంగాణ పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణరావు పాల్గొన్నారు. ప్రపంచ స్థాయి వేదికపై ఏర్పాటు చేసిన తెలంగాణ టూరిజం స్టాల్‌ను మంత్రి జూపల్లి ప్రారంభించారు. తెలంగాణ.. శతాబ్దాల ఘనమైన చరిత్ర, వారసత్వం, సుసంపన్న సంస్కృతి, ప్రకృతి రమణీయత, పర్యాటక ప్రాంతాల గురించి స్థానిక మీడియా, ట్రావెల్ సొల్యూషన్స్ ప్రతినిధులు, తెలుగు అసోసియేషన్ సభ్యులతో చర్చించారు.

విశ్వనగరమైన హైదరాబాదు "భారతదేశం యొక్క సదస్సుల రాజధానిగా" అంతర్జాతీయ సదస్సులకువేదికగా, ప్రపంచ స్థాయి పెట్టుబడులకు కేంద్ర బిందువు గా మారిందని,





పర్యాటక, వినోదం, వ్యాపార, ఐటీ, హెల్త్, ఫార్మా రంగాల్లో అత్యుత్తమ గమ్యస్థానంగా నిలుస్తుందని చెప్పారు. ప్రగతిశీల విధానాలతో తమ ప్రభుత్వం పెట్టుబడులను ప్రోత్సహించడంతో పాటు పర్యాటక రంగంలో భాగస్వాముల సహకారంపై దృష్టి పెట్టామని పేర్కొన్నారు.

వాణిజ్య ప్రదర్శనలో ఏర్పాటు చేసిన విదేశీ స్టాళ్లను మంత్రి జూపల్లి సందర్శించారు. కొత్త అనుభూతులు, అన్వేషించని ప్రదేశా లను చూడాలని కోరుకునే నేటి తరం పర్యాటకులకు స్వాగతం పలికేందుకు తెలంగాణ రాష్ట్రం సిద్ధంగా ఉందని, ఘనమైన వార సత్వ సంపదతో అలరారుతున్న తెలంగాణ రాష్ట్రంలో పర్యటిం చాలని ఆయా దేశాల ప్రతినిధులకు మంత్రి జూపల్లి ఆహ్వానం పలికారు. భారతదేశం నుండి వచ్చిన అతి కొద్దిమందిలో ఒక తెలంగాణ ప్రతినిధిగా ఈ ట్రేడ్ షోలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు.

ఈ కార్యక్రమానికి తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్. ప్రకాష్ రెడ్డి, పర్యాటక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డి.ఎస్. ఓంప్రకాశ్, టిఎస్టిడిసి మార్కెటింగ్ జిఎం కె. అంజి రెడ్డి, హెచ్సీవిబి (HCVB) సిఇఓ గ్యారీ ఖాన్, హైటెక్స్, మీటీ, నాంధారి ఈవెంట్స్ నుండి సహ ప్రదర్శకులు హాజరయ్యారు.

# చెల్లెమ్మ ప్రియుడిని చంపిన అన్న

- బావమరిది కళ్లల్లో నీళ్లు తుడిచేందుకు..
- ఇదొక పరువు హత్య
- గోదావరిఖనిలో సంచలనం

(ఘంటా వీరభద్రరావు)

పెద్దలు కుదిర్చిన పెళ్లికి ఓ యువతి తలవంచింది. మెడలో తాళికట్టించుకుంది. భర్తతో కాపురం చేసింది. ఇద్దరు పండంటి బిడ్డలకు జన్మనిచ్చింది. కానీ తన మనసులో భర్తకు చోటు ఇవ్వలేదు. ఓ యువకుడిని ప్రేమించింది. పోలీసుల సమక్షంలో తనను ప్రేమించిన వ్యక్తే కావాలని పట్టుబట్టింది. వేరే పెళ్లి చేసుకుంది. హాయిగా కాపురం చేస్తోంది. కానీ బంధువులు సహించలేకపోయారు. తమ పరువు పోయిందని నలిగిపోయారు. కడకు తన చెల్లి కాపురంలో చిచ్చుపెట్టాడనే ఆక్రోశంతో.. ఆమెను పెళ్లాడిన యువకుడిని చంపేశాడు.

చేతికి వచ్చిన కొడుకును పోగొట్టుకున్నామని తల్లిదండ్రులు కన్నీరు మున్నీరు అవుతుంటే.. రెండో పెళ్లి చేసుకున్న ఇల్లాలు ఆ శవం ముందు వెక్కివెక్కి ఏడుస్తోంది. బతుకమ్మ పండుగ వేళ తీవ్ర విషాదాన్ని నింపిన ఈ ఘటన గోదావరిఖని టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని యైటింక్లయిన్ కాలనీ హనుమాన్ నగర్‌లో చోటు చేసుకుంది.



టూటౌన్ సీఐ ప్రసాద్‌రావు, యువకుడి కుటుంబ సభ్యుల తెలిపిన వివరాల ప్రకారం.. సెక్టార్– 3 డిస్పెన్సరీలో స్కావెంజర్‌గా పని చేస్తున్న వడ్డాది కుమార్ టీ2 క్వార్టర్‌లో నివసిస్తున్నాడు. అతని కుమారుడు వినయ్ (27) గోదావరిఖని సింగరేణి ప్రధాన ఆస్పత్రిలో కాంట్రాక్టు స్కావెంజర్‌గా పని చేస్తున్నాడు. బాపూజీ నగర్‌కు చెందిన పెళ్లయిన యువతి అంజలీతో ప్రేమలో పడ్డాడు.

ఈ విషయంలో ఆమె భర్త కుటుంబ సభ్యులు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసుల సమక్షంలోనే ప్రేమించిన యువకుడితో ఉంటానని ఆమె కరాకండీగా చెప్పింది. ఆపై ప్రియుడిని పెళ్లి చేసుకుంది. మూడు నెలలుగా యైటింక్లయిన్ కాలనీలోని హనుమాన్ నగర్‌లో ఓ అద్దె ఇంటిలో కాపురం పెట్టారు.

సద్దుల బతుకమ్మ పూట అంజలీకి తన అన్న ఫోన్ చేశాడు. కాలనీకి వచ్చానని, ఒకసారి చూసి వెళ్తానని చెప్పాడు. అంతే తన ఇంటి అడ్రస్‌ను అంజలి చెప్పింది. పథకం ప్రకారం.. మాజీ భర్తతో కలిసి వచ్చిన అన్న ఇంట్లో మాట్లాడుతూనే తన వెంట తెచ్చుకున్న కత్తితో వినయ్ కుమార్‌పై దాడి చేసి హత్య చేసినట్లు సీఐ తెలిపారు. ఎదిగి వచ్చిన ఒక్కగానొక్క కుమారుడు కళ్లెదుటే హత్యకు గురై ప్రాణాలు కోల్పోవడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

జనం గుండె చప్పుడు
మహానాడు
4
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ ॥ శుక్రవారం 11, అక్టోబర్ 2024 ॥

# పంట నష్టానికి పరిహారం నిధులు విడుదల

- 79,216 మంది రైతులకు చెందిన 79,574 ఎకరాల పంట నష్టానికి 79.57 కోట్ల నిధులు విడుదల
- రైతుల అకౌంట్లకే నేరుగా జమ
- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



హైదరాబాద్,మహానాడు: ఆగస్టు 31 నుండి సెప్టెంబర్ 6 వరకు కురిసిన భారీ నుండి అతిభారీ వర్షాల వలన రాష్ట్ర వ్యాప్తంగా 28 జిల్లాలలో 79,574 ఎకరాలలో పంట నష్టం సంభవించినట్లు అధికారులు నిర్ధారించగా, దానికి సంబంధించి ముఖ్యమంత్రి ఆదేశాలతో కేవలం నెలరోజుల వ్యవధిలోనే పంటనష్ట పోయిన రైతులకు పరిహారం కింద రూ. 79.57 కోట్ల నిధులు విడుదలయ్యాయని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.

అత్యధికంగా పంటనష్టం ఖమ్మం జిల్లాలో (28,407 ఎకరాలు), తర్వాత మహబూబాబాద్ (14,669), సూర్యాపేట (9,828 ఎకరాలు) సంభవించినట్లు మిగతా 22 జిల్లాలకు సంబంధించి.. అత్యల్పంగా 19 ఎకరాల నుండి 3,288 ఎకరాల వరకు పంటనష్టం జరిగినట్లు వ్యవసాయశాఖ అధికారులు నిర్ధారించారు.పంట నష్ట పరిహారం ఎకరానికి 10 వేల చొప్పున నేరుగా రైతు ఖాతాలలోనే జమ అయ్యేటట్లు అధికారులు ఏర్పాటు చేసినట్టు మంత్రి తెలిపారు.

## దేవాలయాల్లో ఇకపై ఆగమశాస్త్రాల ప్రకారమే

# నిత్య పూజాదికాలు.. క్రతువులు

- ఉత్తర్వులు జారీ
- 12వ తేదీన భక్తులందరికి అమ్మవారి ఉచిత దర్శనం
- దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ప్రకటన
- జీవోలోని ముఖ్య అంశాలు



విజయవాడ,మహానాడు: ఆగమ శాస్త్రాలు, ఆచార, వ్యవహారాలు సంప్ర దాయాల విషయంలో కమిషనర్‌తో సహా, RJC/ DC/AC, తదతర స్థాయిల్లోని పరిపాలనా అధికారా లున్న అధికారులెవ్వరూ జోక్యం చేసుకోకూడదు.

ఆయా దేవాలయాల్లో ఉత్సవాలు, క్రతువులు, సేవలు పూజాది కార్యక్రమాల నిర్వహణలో నిర్ణ యాలు, యాగాలు, కుంభాభిషేకాల వంటి వాటి ముహుర్తాలు, మరియ నిర్వహణ,మరియ పండు గులు /ఉత్సవాలు ఆయ దేవతామూర్తులకు సేవ లకు సంబంధించిన అంశాలు,

కొత్తసేవల ప్రారంభం వంటి వాటి ప్రతి పాదనలు లేదా నిర్ణయాలకు సంబంధించి అంశాల్లో ఆయా దేవాలయాల్లోని అనుభజ్ఞులైన అర్చకులు (సీనియర్ మోస్ట్ అర్చకులు) మరియ మతపరమైన సిబ్బంది అభిప్రాయమే తుది నిర్ణయం గా తీసుకోవాలి.

దీనికి సంబంధించి 6(ఏ) విభాగంలోని దేవా లయాల ఇవోలు అవసరమైతే దేవాలయాల్లోని అను భజ్ఞులైన మతపరమైన సిబ్బందితో వేదిక్ కమిటీని నియమించవచ్చు. వారిమధ్య కూడా ఏకాభిప్రాయం కుదరనప్పుడు సంబంధిత ఆగమ పీఠాధిపతులను సంప్రదించవచ్చు.

ఇటువంటి కమిటీల ఏర్పాటు అంశంలో ప్రతి దేవాలయాన్ని దేనికి దానిగా ప్రత్యేకంగా పరిగణిం చాలి. ఒక విధానాన్ని పాటిస్తున్న దేవాలయానికి, అటువంటి ఆచార వ్యవహారాలే పాటిస్తున్న మరొక దేవాలయానికి కూడా వర్తింప చేయాలని ఒత్తిడి చేయకూడదు.

దేవాలయాల ఇవోలు, ఆగమ సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలకు సక్రమంగా పాటించేలా చూడటంలో తప్ప, ఆయా దేవాలయాల్లో నిత్యం జరుగుతున్న క్రతువులు,సేవలు, యాగ, కుంభాభి షేక ముహుర్తాల నిర్ణయం తదితర అంశాల్లో ఎటువంటి పరిస్థితుల్లోనూ జోక్యం చేసుకోకూడదు.


### 12వ తేదీన భక్తులందరికి అమ్మవారి ఉచిత దర్శనం

దసరా నవరాత్రుల సందర్భంగా 12వ తేదీన భక్తులందరికి అమ్మవారి ఉచిత దర్శనం ఉంటుం దని దేవదాయ ధర్మదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ప్రకటించారు.

గురువారం నాడు అమ్మవారి ఆలయంలో జరిగిన చతుర్వేద సభలో మంత్రి ప్రసంగిస్తూ అమ్మ వారి ఉత్సవాలలో భాగంగా విజయదశమి రోజున భక్తులందరికి దర్శనం ఉచితంగా కల్పిస్తున్నామని చెప్పారు. లక్షలాది మంది భక్తులు తరలి వస్తున్నా రని, అందరికి ఎటువంటి అసౌకర్యం కలుగకుండా దర్శనం కలిగించడం తమ బాధ్యతని ఆయన చెప్పారు.

ఇక నుంచి అన్ని జిల్లాలలో చతుర్వేద సభలు నిర్వహించే ఆలోచన ఉందని మంత్రి చెప్పారు. ఈ సభలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ పాల్గొన్నారు. ఆలయ ఈఓ రామారావు, ప్రత్యేక అధికారి రామచంద్ర మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# రతన్ "టా...టా"



రాయిలా పుట్టి శిల్పమై ఎదిగాడు భువిపై జాతి (భారత) రత్నమై నిలిచాడు.

అందరికీ కన్నీటి ధారలు మిగిల్చి దివి కేగాడు పుణ్య పురుషుడు...అతనే రతన్ టాటా.

నిజమైన దేశభక్తికి నిదర్శనం తను...మహాత్ముడు అనీ నిర్వ చించడానికి నిర్వచనమే తను.

మహనీయుడు అని చెప్పడా నికి తార్కాణం తన సేవానిరతి గుణము,... కరోనాకు, టీకా (వ్యాక్సిన్) కనుక్కోండి. తన సర్వస్వం కూడా ధార పోయు టకు సంసిద్ధత తెలిపి, సంపద ను మొత్తం తృణ ప్రాయంగా భావించిన త్యాగ శీలి.

తను అద్భుత మేధావి అని చెప్పడానికి తానే నిలువెత్తు సాక్ష్యం, తనో అలుపెరుగని పారిశ్రామిక యోధుడు.

మహత్తయిన నేటి ప్రపంచం లో మహనీయమైన సేవలు అందించిన మహాపురుషుడు, నిస్వార్థ పరుడు నేటి ఈ మహాత్ముడు.

సంపాదించే ప్రతి పైసాను మాతృభూమికే చెందాలని కోరే మహోన్నతమైన దేశ భక్తుడు. సాంకేతిక పరిజ్ఞానంలో తను తన దేశం ఎవ్వరికీ తక్కువ కాదనే దృఢ సంకల్ప మేధావి.

సంపాదించిన దాంట్లో కొంత భాగమైన దేశానికి, బీదలకు ఉపయోగపడాలని అపర దాన శీలి నేటి కలియుగ కర్ణుడు.ఆధ్యాత్మికతను కొత్తగా నిర్వ చించిన అలుపెరుగని మానవ త వాది నిత్యాన్వేషి ఈ నవయుగ వైతాళికుడు.

విద్యతో సంస్కారం రావాలని చెప్పే గొప్ప ప్రజ్ఞాశీలి.కష్టంతో గుర్తింపు రావాలి.కానీ అహం రాకూడదు అనే చెప్పే అద్భుత

జ్ఞాన శీలి, నిగర్వి.

గుండు సూది నుండి, గగన సీమ విమానము,రాకెట్టుల వరకు తయారు చేసే కర్మాగా రానికి ఆయువు పట్టు అయిన పారిశ్రామిక విప్లవ చైతన్య మూర్తి.

రాజకీయాలకు అతీతుడు

వేలెత్తి చూపలేని వ్యక్తిత్వం

మానవ సేవలో తరించడం వారి తత్వం.

స్నేహం అంటే వయసుతో కొలవ లేనిది,అనే కొత్త భాష్యం చెప్పిన స్నేహ శీలి, వివరణ, సవరణ లేని మహోన్నతుడు.

జీవితంలో ప్రతి పోరాటాన్ని అనుభవములా స్వీకరించి గొప్ప స్థాయికి ఎదగాలని చెప్పే నిత్య పరిశోధకుడు.

మనిషిలో నమ్రతను, సంస్కా రాన్ని నేర్పేది విద్య అని సరి కొత్త భాష్యం చెప్పిన అద్భుత మేధావి వీరు.

నీతి, నిజాయితీలకు నిలువెత్తు సాక్ష్యం, ఈ మహనీయుడు.

జీవిత కాలములో ఎన్నో ఒడు దుడుకులు ఎదుర్కొని తాను వ్యక్తి నుండి,శక్తిగా మారి ఎంతో మందికి జీవనభృతి నందించి న అద్భుత శ్రమజీవి.

దాతృత్వం వారి గడప, నీతి వారి భూషణం, వినమ్రత వారి సంస్కారమూ, దేశభక్తి వారి చిరునామా, నిష్కల్మష హృద యం వారి గుర్తింపు.


వీరికి నా హృదయ పూర్వక అశ్రునివాళి.

- ఈ ఆర్. నాగ కుమార్. పేలాల

# దసరా పండుగను సంతోషంగా జరుపుకోండి

- గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడ్లవల్లేరు, మహానాడు: ప్రజలందరూ దసరా పండుగను సంతోషంగా జరుపుకోవాలని... ప్రభుత్వంపైన, రాష్ట్ర ప్రజలపై అమ్మవారి కరుణాకటాక్షాలు ఉండాలని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అమ్మవారిని ప్రార్థించారు. ప్రసిద్ధిగాంచిన వేమవరం శ్రీ కొండాలమ్మ అమ్మవారి దేవస్థానంలో శ్రీదేవి శరన్నవరాత్రుల గ్రామోత్సవ ఊరేగింపు గురువారం అత్యంత వైభవంగా ప్రారంభమైంది. అమ్మవారికి పూజా కార్యక్రమాలు నిర్వహించి, ఊరేగింపును ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ప్రారంభించారు. భక్తులతో కలిసి, ఊరేగింపులో ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వర్రావు ఉత్సా హంగా పాల్గొన్నారు. 20వేల మందికి పెద్ద ఎత్తున అన్న సమారాధన ఏర్పాట్లు చేసిన దేవాదాయ శాఖ అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో ఆకుల కొండలరావు, టీడీపీ నాయకులు కొడాలి రామరాజు, వల్లభనేని వెంకట్రావు, వెనిగండ్ల రామకృష్ణ (నాని), చేకూరు జగన్మోహన్రావు, మల్లిపెద్ది సుబ్రహ్మణ్యం, పొట్లూరి రవి, కొలా రాధాకృష్ణ, వల్ల భనేని బాబురావు, కన్య భాస్కర్ రావు, నారగాని శ్రీను, కొప్పునేమి పిచెశ్వరావు, గరికిపాటి రాంబాబు,



పెన్నేరు రమేష్, దేవస్థాన ఉత్సవ కమిటీ సభ్యులు చిట్టిబొమ్మ వీర రాజు, పామర్తి సత్య బాబు, అడపా డీవీఎస్ చంద్ర శేఖర్ బాబు, మన్నెం వీరనరేంద్రరావు, వడ్ల ముడి పద్మజ, ఈడే వెంకట విష్ణు మోహన్ రావు, కొప్పినేని నాగ వెంకట లక్ష్మి, ఉస్తిల పావని, గుడ్లవల్లేటి వాణి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



దాతృత్వానికి ప్రతిరూపంగా నిలిచిన మహోన్నత వ్యక్తి రతన్ టాటా. ఎందరికో ఆదర్శంగా నిలుస్తూ, భారతదేశానికి, పారిశ్రామిక రంగానికి పేరు ప్రఖ్యాతి తెచ్చిన మహోన్నత వ్యక్తికి విశాఖ చిత్రకారుడు మోకా విజయ్ కుమార్ గురువారం ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మిలెట్స్ ఉపయోగించి రతన్ టాటా చిత్రాన్ని తయారు చేశారు. ఆ మహనీయునికి తాను ఇచ్చే నివాళి ఇది అని విజయ్ కుమార్ పేర్కొన్నారు.



# మహా దార్శనికుడు రతన్ టాటా

- మంత్రి లోకేష్

అమరావతి, మహానాడు: విలువలు, మానవత్వంతో కూడిన వ్యాపార సామ్రాజ్యాన్ని నిర్మించిన మహా దార్శనికుడు రతన్ టాటా. దేశాభివృద్ధి, ప్రజా శ్రేయస్సు, ఉద్యోగుల సంక్షేమమే పరమావధిగా టాటా గ్రూప్ సంస్థలను దశాబ్దాలుగా అదే నిబద్ధతతో నిర్వహించిన పద్మ విభూషణ్ రతన్ టాటా సేవలు చిరస్మరణీయమని విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. టాటా గ్రూప్ ఉత్పాదనలు వాడని భారతీయులు ఉండరు. దేశంలో ఏ మూల ఏ విపత్తు సంభ వించినా భారీ విరాళంతో స్పందించే మానవత్వపు హృదయం రతన్ టాటా జీ. నిజాయితీని, నిస్వార్థ పరత్వాన్ని టాటా బ్రాండ్‌గా చేసిన రతన్ టాటాకి మరణం లేదు. ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా జీవించే ఉంటారు. నమ్మకమైన టాటా ఉత్పత్తుల రూపంలో ప్రతి ఇంట్లోనూ మనందరినీ ప్రతిరోజూ చిరునవ్వుతో పలకరిస్తూనే ఉంటారు. రతన్ టాటా నిరుపమానమైన సేవలను స్మరిస్తూ, అశ్రు నివాళు లు అర్పిస్తున్నానని మంత్రి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

### రతన్ టాటా మృతి దేశానికి తీరని లోటు

- మంత్రి నారాయణ

పారిశ్రామిక దిగ్గజం రతన్ టాటా మృతి దేశా నికి తీరని లోటని మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. కేవలం పారిశ్రామికవేత్తగా మాత్రమే కాకుండా ఉన్నతమైన విలువలు కలిగిన అదర్శ వాది రతన్ టాటా. రతన్ టాటా జీవితం అందరికీ ఆదర్శం.

విద్య, వైద్యం వంటి రంగాల్లో రతన్ టాటా సేవలు అద్వితీయం. కేవలం మన దేశంలోనే కాకుండా 100కు పైగా దేశాల్లో అనేక పరిశ్రమలు స్థాపించి అనేకమందికి ఉపాధి చూపించారు. రతన్ టాటా ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తున్నానని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.



# ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసీపీని భూస్థాపితం

- యువతకు ఎమ్మెల్సీ జీవీ పిలుపు

వినుకొండ, మహానాడు: త్వరలో జరగబోతున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో యువత కొట్టే దెబ్బకు మళ్లీ వైసీపీ లేవకూడదని తెలుగుదేశం పార్టీ(టీడీపీ) వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనే యులు పిలుపునిచ్చారు. అధికారంలో ఉన్నప్పుడే జగన్ లాంటి నియంత కొమ్ములు వంచిన యువతరం, రానున్న ఎమ్మెల్సీ ఎన్నికలతో ఆ పార్టీని పూర్తిగా భూస్థాపితం చేయాలని కోరారు. ఉద్యోగాల్లేకుండా, ఉపాధి లేకుండా అయిదేళ్ల పాటు సాగించిన విధ్వంసపు పాలనను దృష్టిలో పెట్టుకుని ప్రతిఒక్కరు ఓట్లు నమోదు చేసుకుని మార్పును బలపరిచేందుకు కూటమి అభ్యర్థిని గెలించాలని విజ్ఞప్తి చేశారు.

ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్ట భద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు నమోదుకు సంబంధించిన దరఖాస్తులను గురు వారం ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు పంపిణీ చేశారు. వినుకొండ నియోజకవర్గంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ నిర్వహణకు పరిశీలకులుగా పార్టీ నాయకులు పంచుమర్తి భూపతిరావు, పాములపాడు శ్రీనివాసరావు, నల్లబోతు శ్రీని వాసరావు, రఘురావు నాయుడు, సైదారావు, రాంకోటేశ్వరరావును నియమించారు.

పార్టీ స్థానిక కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వారికి ఓటు నమోదు దరఖాస్తు లను అందజేశారు. బీజేపీ నాయకులు యార్లగడ్డ లెనిన్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఆయూబ్ ఖాన్, శావల్యాపురం, వినుకొండ రూరల్ మండలాల పార్టీ అధ్యక్షుడు గుంటూరు సాంబశివరావు, మాది నేని ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.



## గోదావరి పుష్కరాలకు కేంద్రం

# రూ.100 కోట్లు విడుదల

అమరావతి, మహానాడు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం శు భవార్త చెప్పింది. గోదావరి నది పుష్కరాలకు కేంద్ర ప్రభుత్వం రూ.100 కోట్లు నిధులు విడుదల చేసింది. తూర్పుగోదావరి జిల్లాకు గోదావరి పుష్కరాలు నిర్వహించడం కోసం రూ.100 కోట్లనిధులు కేటాయింపులు జరిగాయి. 2027 గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని అఖండ గోదావరి ప్రాజెక్ట్ లో భాగంగా కేంద్ర ప్రభుత్వం తూర్పు గోదావరి జిల్లాకు ఈ నిధులు కేటాయించింది. ఈ దిశగా టూరిజం శాఖ అధికారులు పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి.

# సీఎంఆర్ఎఫ్‌కు రూ.3.50 లక్షల విరాళం

- సీఎం చంద్రబాబుకు అందజేసిన మంత్రి సవిత


అమరావతి, మహానాడు: విజయవాడ వరద బాధితులకు ఆర్థిక సాయం నిమిత్తం పెనుకొండ నియోజక వర్గ దాతలు అందజేసిన రూ.3.50 లక్షల విరాళాన్ని సీఎంఆర్ఎఫ్‌కు రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత అందజేశారు. ఈ మేరకు గురువారం మంత్రిమండలి సమావేశం అనంతరం సీఎం చంద్రబాబునాయుడుకు మంత్రి చెక్ లను అందజేశారు.



పెనుకొండ పట్టణానికి చెందిన ప్రగతి, రేవతి, బాబా ఫక్రుద్దీన్, దాదా పీర్, బాబా మహిళా గ్రామ సమాఖ్యల్లోని సభ్యులు అందజేసిన రూ.1.50 లక్షలు, బూదిలి గ్రామానికి చెందిన భ్రమరాంభిక మహిళా సంఘ సభ్యులు ఇచ్చిన రూ.50 వేలు, ఆంధ్రప్రదేశ్ బ్యాంకు రిటైరీస్ ఫెడరేషన్ రూ.లక్ష, పరిగి మండల కేంద్రానికి చెందిన ఇటుక బట్టీ యజమానులు రూ.50 వేలు... ఇలా మొత్తం రూ.3.50 లక్షలను సీఎం చంద్రబాబుకు మంత్రి సవిత అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాట్లాడుతూ...విజయవాడ వరద బాధితులను ఆదుకోడానికి ముందుకొచ్చిన పెనుకొండ నియోజక వర్గానికి చెందిన దాతలను అభినందించారు. ఇదే స్ఫూర్తితో మరికొందరు దాతలు బాధితులను ఆదుకోడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు.


# దేశం పారిశ్రామిక దిగ్గజాన్ని కోల్పోయింది

విజయవాడ, మహానాడు: రతన్ టాటా ఇక లేరన్న విషయం తెలుసుకుని పారిశ్రామిక రంగం శోకసంద్రంలో మునిగి పోయింది..



భారత దేశం విలువలతో కూడిన పారిశ్రామిక దిగ్గజాన్ని కోల్పోయిందని భారతీయ జనతా పార్టీ(బీజేపీ)కి చెందిన పలువురు నేతలు విచారం వ్యక్తం చేశారు. రతన్ టాటా జాతీయ వాది, గొప్ప మానవతా వాదిగా వారు పేర్కొన్నారు.

పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి, కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, రాష్ట్ర మంత్రి వై.సత్య కుమార్ ఎక్స్ వేదికగా తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.



సచివాలయంలో మహిళా శిశు సంక్షేమ, గిరిజన శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణిని మండ్రు సుబ్బారావు, గంగినేని బాబు, చంద్రశేఖర్, కంచుమాటి నరేష్ గురువారం కలిసి కమ్మవారి పాలెం ఎస్టీ కాలనీలోని సమస్యలను తెలిపారు. మంత్రి సానుకూలంగా స్పందించి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

జనం గుండె చప్పుడు

# మహానాడు

5

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ ‖ శుక్రవారం 11, అక్టోబర్ 2024 ‖

## మహోన్నత వ్యక్తి రతన్ టాటా

● బీజేపీ ఘన నివాళి

**విజయవాడ, మహానాడు:** ప్రముఖ పారిశ్రామికవేత్త రతన్ టాటా ఇక లేరన్న విషయం దేశాన్ని శోకసంద్రంలో ముంచేసింది... దేశం సేవలో పరితపించిన మహోన్నత వ్యక్తి రతన్ టాటా అని భారతీయ జనతా పార్టీ(బీజేపీ) పలువురు రాష్ట్ర నేతలు గుర్తు చేసుకున్నారు. పార్టీ రాష్ట్ర సంఘటనా ప్రధాన కార్యదర్శి మధుకర్ జీ రతన్ టాటా చిత్రపటానికి పూలమాల వేసి, ఘన నివాళులు అర్పించారు. రాష్ట్ర కార్యాలయంలో గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ మైనారిటీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ బాజీ మాట్లాడుతూ దేశంలో ఏ విపత్తు ఏర్పడినా దేశ ప్రజలను ఆదుకోవడానికి రతన్ టాటా ముందు వరుసలో ఉండేవారు. ఎన్టీఆర్ జిల్లాకు కూడా ప్రత్యక్షంగా నిధులు ఇచ్చిన రతన్ టాటాకు ఈ జిల్లా రుణపడి ఉందన్నారు. భారత దేశం విలువలతో కూడిన




పారిశ్రామిక దిగ్గజాన్ని కోల్పోయిందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కోశాధికారులు మొగళ్ళ నాగేంద్ర, కందుకూరి సత్యనారాయణ, సీనియర్ నేత ముప్పల వెంకట సుబ్బయ్య, పీయూష్ దేశాయ్, తదితరులు పాల్గొన్నారు.

## రతన్ టాటాను భారత ప్రభుత్వం గుర్తించాలి

● ఉండి శాసన సభ్యుడు రఘురామకృష్ణంరాజు

**ఉండి, మహానాడు:** ప్రపంచం గుర్తించి గౌరవించిన దిగ్గజ పారిశ్రామిక వేత్త, గొప్ప మానవతావాది, దార్శనికుడు, తన దాతృ త్వంతో సమాజ హితానికి కృషిచేసిన రతన్ టాటా భారత ప్రభుత్వం గుర్తించి గౌరవించాలని ఉండి శాసన సభ్యుడు రఘురామకృష్ణం రాజు సూచించారు. రతన్ టాటా సేవలను గుర్తించి గౌరవించడం ద్వారా ప్రపంచ దేశాలలో భారతదేశ కీర్తి ప్రతిష్ఠలు మరింత ఇనుమడిస్తాయని పేర్కొన్నారు. రతన్ టాటా వంటి మహానుభావుడి మహాభినిష్క్రమణం నిజంగా దేశానికి, ప్రపంచానికి తీరని లోటని ఆయన పేర్కొన్నారు. మరణించిన తర్వాత జీవించి ఉండే అతి కొద్ది మంది వ్యక్తులలో రతన్ టాటా ఒకరిని తెలిపారు.



రతన్ టాటా భౌతికంగా లేకపోయినప్పటికీ, టాటా గ్రూప్ సంస్థలు జెఆర్ డి టాటా, రతన్ టాటా సిద్ధాంతాల ప్రకారమే నడుస్తాయన్నారు. ఎన్టీ రామారావు, రామోజీరావు, రతన్ టాటా లది మరణం లేని జననం అని రఘురామ కృష్ణంరాజు కొని యాడారు. జేఆర్డీ టాటా చూపెట్టిన మార్గంలో పయనిస్తూ రతన్ టాటా ఎటువంటి ప్రచార ఆర్భాటం లేకుండా ఎన్నో గుప్త దానాలను చేశారని రఘురామ కృష్ణంరాజు తెలిపారు.

రతన్ టాటా జీవించి ఉండగానే ఆయనకు దేశం లోని అత్యున్నత పౌర పురస్కారమైన భారతరత్న అవార్డు ఇస్తారని ఆశించినట్లుగా రఘురామ కృష్ణంరాజు తెలిపారు. రతన్ టాటా ను మూడుసార్లు కలుసుకుని అవకాశం తనకు లభించిందని రఘురామ కృష్ణంరాజు తెలిపారు.

అనేక రంగాలలో భారత పారిశ్రామిక పురోగతి కి టాటా సంస్థ దోహద పడిందన్నారు. ప్రపంచ దేశాల మానవాళి కోసం తన దాతృత్వం ద్వారా కృషిచేసి, అందరి మన్నలను పొందిన రతన్ టాటాకు, భారత ప్రభుత్వం ఎటువంటి నివాళులను అర్పిస్తుందో చూడాలన్న రఘురామ కృష్ణంరాజు, రతన్ టాటా మరణంతో ప్రతి ఒక్క భారతీయుడు బాధాతప్త హృదయంతో నివాళులర్పిస్తున్నారన్నారు. రతన్ టాటా ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలుస్తారని రఘురామ కృష్ణంరాజు అన్నారు.

## సబ్ కా సాత్ వద్దే వద్దు.. సబ్ కా వికాస్ అసలే వద్దు

● ఆ నినాదం బీజేపీ ఇకనైనా విడిచిపెడితేనే మంచిది

(హెజీబు శ్రీనివాసరావు)

కాశ్మీర్ ప్రాంతంలో బీజేపీ సీట్లు గెలవలేక పోయింది కనుక ఆ ప్రాంత ప్రజలు.. కాశ్మీర్ రాష్ట్రంలో 370 ఆర్టికల్ తీసేయడానికి వ్యతిరేకంగా ఉన్నారని కొందరు విశ్లేషిస్తు న్నారు. విపరీత అర్థాలు తీస్తున్నారు. సూత్రీకరణలు చేసు _న్నారు.

హైదరాబాద్ లోకసభ నియోజకవర్గంలో బీజేపీ గెలుస్తుందా ?

లేదు...

గెలవదు...

[మరిక్కడ 370 ఆర్టికల్ గట్రా ఏమీ లేవే !!]

ఎందుకంటే...అక్కడున్న మెజారిటీ ఓటర్లకు దేశం కంటే.. దేశాభివృద్ధి కంటే.. వాళ్లకు "మతం" మాత్రమే ముఖ్యం. అలాగే... కాశ్మీర్ ప్రాంతంలో కూడా అంతే. 370 ఆర్టికల్ తీసేసారా? అభివృద్ధి చేశారా? అనేది వాళ్లకన వసరం. వాళ్లకు అవేవీ అవసరం కూడా లేదు. అసలవేవీ పట్టవు కూడా. వాళ్లకు అసలవేవీ ప్రాధాన్యత అంశాలు కూడా కాదు. వాళ్లకున్నది కేవలం బీజేపీ పట్ల వ్యతిరేకత.

అంతే!

అందుకు కారణం వాళ్ళకున్న మత పిచ్చి. వాళ్లకు మతం మాత్రమే కావాలి. అభివృద్ధి... దేశం... 370 ఆర్టికల్ తీసివేత... కాకరకాయ... కుంకుడుకాయ కాదు.



సో..

వాళ్ళది కేవలం బీజేపీపై వ్యతిరేకత మాత్రమే. 370 ఆర్టికల్ రద్దు అనేది అంశంనే కాదు.

ఇక ఇక్కడ కిందున్న వీడియోలో చూడండి...

బీజేపీ 370 ఆర్టికల్ తీసివేయడం మూలంగా అభివృద్ధి జరుగుతున్నది.

కాశ్మీర్ లోయ ప్రశాంతంగా వుంది. తమకు ఉపాధి దొరుకుతున్నది.

అలాగే తమ పిల్లలకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చదువు సాగుతున్నది..అంటూ పెద్ద లిస్ట్ చదివాడు.

అయితే...

ఇన్ని ప్రయోజనాలు బీజేపీ మూలంగానే కల్గినప్పటికీ కూడా, తాను బీజేపీ కి మాత్రం ఓటు వేయను అని, ఖరాఖండిగా చెబుతున్నాడు.

అదేదో ఇది ఒక్క కాశ్మీర్ లోయలో వున్న ముస్లిం అభిప్రాయం మాత్రమే కాదు.

దేశ వ్యాప్తంగా మొత్తం వాళ్ళ ఆలోచనా విధానం కూడా అంతే.

మొన్నటి లోకసభ ఎన్నికల్లో కూడా, వాళ్ళ ఇదే ధోరణి దేశ వ్యాప్తంగా చూసాం కదా!

ఇక ముస్లింలున్న కాశ్మీర్ లోయలో కాంగ్రెస్ కూటమికి అనుకూలంగా ఓట్లు పడితే... ఇక హిందువులు ఉన్న జమ్మూ ప్రాంతంలో బీజేపీ కి అనుకూలంగా ఓట్లు పడ్డాయి. అంటే 370 ఆర్టికల్ వ్యతిరేకత లేదా అనుకూలత అనేది అసలు అంశమే కాదు. మతం తప్ప..

అయితే హిందువులు ఉన్న ప్రాంతంలో మతానికి ప్రాధాన్యత అంతగా ఉండదు. అభివృద్ధికి తప్ప!

సో..

"సబ్ కా సాత్ – సబ్ కా వికాస్" అనే విధానం... నినాదం బీజేపీ ఇకనైనా విడిచిపెడితేనే మంచిది. వాళ్లకు ఎన్ని చేసినా బీజేపీ కి ఓటు వేయరు గాక వేయరు. కనుక అదేదో హిందువులకు ఇంకా మేలు కల్గిగే నాలుగు పనులు చేస్తే, బీజేపీకి ఇంకో పది ఓట్లు అదనంగా వస్తాయ్.

కనుక...

"సబ్ కా సాత్" వద్దే వద్దు

"సబ్ కా వికాస్.." అసలే వద్దు

హిందువు లే అసలు ముద్దు



- భారత్ మాతా కీ జై

## రతన్ టాటా మృతిపై బూరగడ్డ వేదవ్యాస్ దిగ్భ్రాంతి

**మచిలీపట్నం, మహానాడు:** రతన్ టాటా మృతిపై మాజీ డిప్యూటీ స్పీకర్, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూరగడ్డ వేదవ్యాస్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన ఏమన్నా రంటే.. రతన్ టాటా మరణం దిగ్భ్రాంతికి గురిచేసింది. మేకిన్ ఇండియా నినాదంతో ముందుకు సాగిన టాటా ప్రయాణం చిరస్మర ణీయం. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించ డమే ధ్యేయంగా టాటా ప్రస్థానం సాగింది. పెద్ద ఎత్తున ఉపాధి కల్పించడంపైనే టాటా ఎక్కువ శ్రద్ధ చూపారు. విపత్తుల సమయంలో ఆపన్న హస్తం అందిం చడంలో టాటాకు సరిలేరెవ్వరూ.. రతన్ టాటా లాంటి దిగ్గజం మరణ వార్త అత్యంత బాధాకరం. టాటా పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా.



## రతన్ టాటా జీవితం మార్గదర్శకం


● మంత్రి జనార్ధన్ రెడ్డి

**అమరావతి, మహానాడు:** దిగ్గజ పారిశ్రామికవేత్త రతన్ టాటా మర ణంపై రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక వసతుల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. రతన్ టాటా మరణం దేశానికి, పారిశ్రామిక రంగానికి తీరని లోటు. విలువలు, విశ్వసనీయత, మానవత్వం కలబోసిన మహనీయుడు రతన్ టాటా.. ఆదర్శప్రాయుడైన రతన్ టాటా జీవితం యువతకు మార్గదర్శకం, అనుసరణీయం.. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తున్నానని తెలిపారు.

## నువ్వు లేవని అంటున్నారు... ఇది భరించ లేనిది..

● రతన్ టాటా మృతిపై మాజీ ప్రేయసి ఎక్స్‌లో పోస్టు

**ముంబయి:** పారిశ్రామిక దిగ్గజం రతన్ టాటా మరణం పట్ల ఆయన మాజీ ప్రేయసి, బాలీవుడ్ నటి సిమి గరేవాల్ సంతాపం తెలిపారు.. 'ఇక నువ్వు లేవని అంటున్నారు. ఇది భరించ లేనిది. వీడ్కోలు నేస్తమా'



అని ఆమె ఎక్స్‌లో పోస్టు పెట్టారు. రతన్ టాటాతో తాను డేటింగ్ చేశానని, ఆ తర్వాత ఇద్దరం విడిపోయినట్టు 2011లో హిందుస్థాన్ టైమ్స్ ఇంటర్వ్యూలో సిమి చెప్పారు. ఓ ఇంగ్లీష్ సినిమాతో తెరంగేట్రం చేసిన ఆమె తర్వాత బాలీవుడ్, బెంగాలీలో పలు చిత్రాల్లో నటించారు.



రవాణా,యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అధ్యక్షతన క్రీడా సంఘాలతో రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) భేటీ

## జీవో 223ను ప్రభుత్వం కట్టుదిట్టంగా అమలు చేయాలి

● బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సిరిపురపు శ్రీధర్ శర్మ

**అమరావతి, మహానాడు:** రాష్ట్రంలో ఉన్న దేవాలయాల అర్చకులకు ఆగమ సాంప్రదాయా లకు అనుగుణంగా ముఖ్యమంత్రి చంద్రబాబు కూటమి ప్రభుత్వం జీవో 223 జారీ చేయడం పట్ల రాష్ట్రంలో ఉన్న అర్చకులు, బ్రాహ్మణ సంఘాలు, భక్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సిరిపురపు శ్రీధర్ శర్మ అన్నారు. ఈ మేరకు ఆయన గుంటూరు బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో మాట్లా డారు. అయితే, ఈ జీవో అమలుపరిచే విధానంలో దేవాదాయ శాఖ అధికారులు అర్చకులకు ఏ మాత్రం సహకరించరేమోనని అనేక అనుమానాలు శ్రీధర్ వ్యక్తం చేశారు.

ఇంతకాలం దేవాలయాలపై, అర్చకులపై పూర్తిస్థాయి పెత్తనాన్ని, నియంతృత్వ వైఖరిని దేవాలయంలో పనిచేసే స్వీపర్ దగ్గర నుంచి ఈవో, అసిస్టెంట్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్, కమిషనర్ వరకు నియంతృత్వం చేసేవారని, ఇప్పటికిప్పుడు ఈ జీవో ద్వారా దేవాలయ ఆగమ సాంప్రదాయాల, ఆచారాల పరిరక్షణ అనేది అర్చకులకు అప్పుజెప్పడం దేవాదాయ శాఖలో అధికారులకు మింగుడు పడని అంశమని అన్నారు. దీంతోనే తాము దీనిపై అనుమాన వ్యక్తం చేస్తున్నట్టు పేర్కొన్నారు.

గతంలో దేవాలయ ఈవోలు ఆగమ సంకరాలు చేపడుతున్న సరే అర్చకుడు వాటిని ఆపలేక, ఎదురు తిరగలేక, ఎవరికి



చెప్పుకోలేని స్థితిలో దేవుడు దగ్గర బాధతో మొరపెట్టుకునేవాడని, అంతలా అర్చకుడిని దేవాదాయ శాఖ అధికారులు భయపెట్టేవారని గుర్తు చేశారు. దేవదాయ శాఖ అధికారులు వివిధ రకాల కుట్రలు కూడా పన్నుతారని ఆందోళన వ్యక్తం చేశారు. చంద్రబాబు ప్రభుత్వం ఇచ్చిన జీవో వల్ల అర్చకులకు, దేవాలయ వ్యవస్థకు ఎంతో మేలు చేకూరుతుందని ఆనందం వ్యక్తం చేశారు. వేద పండితులు, ఘనాపాటిలు, పీఠాధిపతులతో చర్చించి వారి సలహాలు సూచనలతో ఈ జీవోను పూర్తిస్థాయిలో అమలయ్యేలాగా ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎండపల్లి శబరి, వడ్డమాను ప్రసాద్, చిలుమూరు ఫణి, వంగవీటి చైతన్య, కూరపాటి కిషోర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్

● వైసీపీ వైఫల్య పాలనతో వినతుల వెల్లువ

● ఎమ్మెల్యే గొండు శంకర్

**శ్రీకాకుళం, మహానాడు:** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజా దర్బార్ కార్యక్రమం ప్రజా సమస్యల పరిష్కారానికే అని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని తహశీల్దార్ కార్యాలయంలో రూరల్ మండలాల సమస్యలకు సంబంధించిన వినతి పత్రాలను స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో గురువారం ఎమ్మెల్యే శంకర్ స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో వైఫల్యాల కారణంగానే ప్రజల నుంచి పెద్ద ఎత్తున వినతులు వస్తున్నాయన్నారు.

పింఛన్ మంజూరు చేయాలని, ఇంటి బిల్లులు అందించాలని, మంచినీరు, సాగునీరు, తదితర సమస్యలకు సంబంధించిన వినతులు అధికంగా అందించినట్టు తెలిపారు. రీ సర్వే చేసిన దానికి ఎల్ పి నెంబర్లు ఇచ్చి జాయింట్ జాయింట్ అకౌంట్ లో ఇవ్వడంతో ఈ క్రాస్ కూడా జరగని పరిస్థితి నెలకొంది అని తెలిపారు. ధాన్యం అమ్మకాలు, కొనుగోలు కూడా అవకాశం లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఏడాదిగా కొత్త పింఛన్లు అందించిన సందర్భాలు కూడా లేవన్నారు. జగనన్న కాలనీలో ఇల్లు మంజూరైనప్పటికీ బిల్లులు చెల్లించలేదని ప్రజల నుంచి వినతలెక్కువగా అందుతున్నాయని ఎమ్మెల్యే శంకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రూరల్ మండలానికి సంబంధించిన




అన్ని శాఖల అధికారులు, కూటమి పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వరదల సమయంలో తాత్కాలికంగా తొలగించిన రోడ్ల స్థానంలో బాక్స్ కల్వర్టు

● మంత్రులు జనార్ధన్ రెడ్డి, నారాయణ సన్నాహాలు

**అమరావతి, మహానాడు:** సచివాలయంలో రోడ్లు, రవాణా, పెట్టు బడులు, మౌలిక వసతుల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డిని ఆయన కార్యాలయంలో గురువారం రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్,



పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఇరువురు మంత్రుల భేటీ సందర్భంగా విజయవాడ నగర పరిధిలో గత నెలలో బుడమేరు వరదల కారణంగా పలు ప్రాంతాల్లో ఆర్ & బీ రోడ్లు మునిగిపోయిన అంశం చర్చకు వచ్చింది. ముఖ్యంగా నాడు నూజివీడు వెళ్లే రోడ్డును పలు చోట్ల తాత్కాలికంగా తొలగించి, వరద నీటిని బయటకు విడుదల చేయడంతో పెను ప్రమాదం తప్పింది. అనంతరం ఆ రోడ్డును పునర్ నిర్మించడం జరిగింది. అయితే, భవిష్యత్తులో వరదల సమస్య పునరావృతం అయితే, వాటికి శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు వేయాలనే ఆలోచనతో మంత్రులు చర్చించారు.

తాత్కాలికంగా తొలగించిన రోడ్ల స్థానంలో బాక్స్ కల్వర్టు నిర్మించేందుకు రాష్ట్ర రోడ్లు & భవనాల శాఖతో, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ సమన్వయం చేసుకుని ఆ దిశగా ప్రతిపాద నలు సిద్ధం చేయాలని మంత్రులు రోడ్లు, భవనాల శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే, విజయవాడ మున్సిపల్ కమిషనర్ ధ్యాన్ చంద్ కు సూచించారు. ఈ కార్యక్రమంలో ఇరువురు మంత్రులతో పాటు, ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.



వన మహోత్సవంలో భాగంగా గురువారం రైతులకు 10,000 మునగ మొక్కలను శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి పంపిణీ చేశారు. మొక్కల్ని నాటి పర్యావరణానికి ఊపిరి పోసి, కాలుష్యాన్ని తరిమికొట్టి, ఆరోగ్యంగా జీవిద్దామని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు. మండల మాజీ జెడ్పిటిసి కరెడ్ల ఈశ్వరరావు, మాజీ ఎంపీపీ కొల్లి రమణమూర్తి, సర్పంచ్ కెర్రు పార్వతి, పుట్టా శ్రీను, మల్ల రామకృష్ణ, జీఎస్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.



## రతన్ టాటా నిష్క్రమణ భారత జాతికి తీరని లోటు

● ఎంపీ కేశినేని శివనాథ్ సంతాపం

**విజయవాడ, మహానాడు:** దేశ పారిశ్రామిక, వాణిజ్య రంగ పురోగతిలో కీలకపాత్ర పోషించిన అసాధారణ మానవతావాది రతన్ టాటా మృతి బాధాకరం. ఆయన మరణం పారిశ్రామిక రంగానికే కాకుండా సమాజ సంక్షేమాన్ని ప్రగతిని కాంక్షించే ప్రతి ఒక్కరికీ తీరని లోటని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. రతన్ టాటా పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ శోకతప్తులైన వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

## క్రీడాభివృద్ధికి పెద్దపీట

● మంత్రి మండిపల్లి

**విజయవాడ, మహానాడు:** క్రీడా సంఘాలతో రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) గురువారం భేటీ అయింది. క్రీడా శాఖ మంత్రి మండిపల్లి



రాంప్రసాద్ రెడ్డి అధ్యక్షతన వహించారు. క్రీడా విధానం, భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. క్రీడారంగాన్ని నవీకరించే విధంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రయత్నాలు మొదలయ్యాయని, సీఎం చంద్రబాబు ఆదేశా లతో క్రీడా సంఘాలతో చాలాకాలం తర్వాత శాప్ సమావేశం ఏర్పాటు అయినట్టు తెలిపారు. సమావేశంలో శాప్ ఛైర్మన్ రవినాయుడు, ఎండీ గిరీష్, పలు క్రీడా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని)ను మర్యాద పూర్వకంగా కలిసిన కడప ఎమ్మెల్యే మాధవి రెడ్డి,పోలిట్ బ్యూరో సభ్యుడు, కడప జిల్లా అధ్యక్షుడు రెడెప్పగారి శ్రీనివాసుల రెడ్డి

జనం గుండె చప్పుడు

# మహానాడు

6

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || శుక్రవారం 11, అక్టోబర్ 2024 ||

### ఖర్చు చేసిందే రూ.203 కోట్లయితే

# రూ.534 కోట్ల దోపిడీ ఎలా?

- ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

**వినుకొండ, మహానాడు:** విజయవాడ వరద బాధితులను ఆదుకోవడానికి ప్రభుత్వం ఖర్చు చేసిందే రూ.203 కోట్లు అయితే రూ.534 కోట్ల దోపిడీ ఎలా సాధ్యమని, జగన్ రెడ్డి, వైసీపీ నేతల్ని తెలుగుదేశం పార్టీ(టీడీపీ) వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ప్రశ్నించారు. నాడు వరద బాధితుల్ని ఆదుకోవడానికి ఏమాత్రం చేతులు రాని జగన్... ప్రభుత్వం చేసిన సాయంపై మాత్రం పనిగట్టుకుని దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. గురువారం బొల్లాపల్లి ఎంపీడీవో కార్యాలయంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వివిధ శాఖలకు చెందిన అధికారులు అభివృద్ధి నివేదికలతో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మండలంలోని పలు సమస్యలపై చర్చించి శాఖల వారీగా అధికారులందరికీ ఎమ్మెల్యే జీవీ దిశానిర్దేశం చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కలిసి పనిచేసి బొల్లాపల్లి మండలాభివృద్ధికి తోడ్పాడాలని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు సూచించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన జీవీ కష్టాల్లో ఉన్న ప్రజలను ఆదుకోవాల్సిందిపోయి జగన్ ఈ చెత్త ప్రచారాలు ఏంటని ఆగ్రహం వ్యక్తం చేశారు.



లక్షల కోట్లు దోచుకున్న జగన్‌రెడ్డి రూ.కోటి విరాళం ప్రకటించడమే ప్రజలకు విడ్డూరంగా కనిపించిందని, ప్రకటించిన విరాళంలో రూపాయి కూడా ఇవ్వకపోవడం దుర్మార్గమన్నారు. ఈ సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు జరపాల గోవింద నాయక్, నాయకులు పెమ్మసాని నాగేశ్వరరావు, దాసరి కోటేశ్వరరావు, తిప్పిశెట్టి వెంకటేశ్వర్లు, ఎలిసెట్టి రంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

## దసరా నుంచి పల్లెలు, గ్రామీణ ప్రాంత రోడ్లకు పండగే

- ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

**యడ్లపాడు, మహానాడు:** రాష్ట్రంలో పల్లెలు, గ్రామీణ రోడ్లకు ఈ దసరా నుంచి మొత్తం పండగ వాతావరణమే అని మాజీ మంత్రి, తెలుగుదేశం పార్టీ(టీడీపీ) చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. పట్టణాలు, గ్రామాల్ని కలిపి రోడ్ల నుంచి గ్రామాల్లో అంతర్గత మార్గాల వరకు అన్నింటికీ కూటమిప్రభుత్వం కొత్తరూపు ఇవ్వబోతున్నట్టు తెలిపారు. యడ్లపాడు మండలం బోయపాలెం-సంగంగోపాలపురం ఆర్ అండ్ బి రోడ్డు నుంచి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలుర గురుకుల పాఠశాల వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి గురువారం ఎమ్మెల్యే ప్రత్తిపాటి శంకుస్థాపన చేశారు. రూ.45 లక్షల ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులతో ఈ సీసీ రహదారిని నిర్మించనున్నారు.



ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన అన్ని వసతులు, చుట్టూ కొండల మధ్య ఆహ్లాదకరమైన వాతావరణం, విశాలమైన భవనాలతో ప్రతిష్ఠాత్మకమైన గురుకుల పాఠశాల ఇక్కడ ఉండడం పేదవిద్యార్థులకు వరమన్నారు.

త్వరలోనే ఈ పాఠశాల స్థాయి ప్లస్ టూకి పెరగనుందన్నారు. ఇక్కడ వెయ్యిమంది పిల్లలు చదువుకునేందుకు, వసతి ఉన్నాయని, పాఠ శాలకు వెళ్లేందుకు రహదారి నిర్మాణం చేయాలని విద్యార్థులు కోరిన తర్వాత సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సహకారంతో రూ.45 లక్షలతో సీసీ రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేశామన్నారు.

## త్వరలో ఇంటర్నేషనల్ డ్రైవింగ్ స్కూల్ పనులు ప్రారంభం

- టీడీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

**దర్శి, మహానాడు:** దర్శి నియోజకవర్గ ప్రజల చిరకాల వాంఛగా గత తెలుగుదేశం ప్రభుత్వంలో ప్రారంభమైన ఇంటర్నేషనల్ డ్రైవింగ్ స్కూల్‌ను వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకుండా వదిలేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మళ్ళీ ఈ ప్రాంత వాసుల ఆశలు చిగురించాయి.

దీంతో దర్శి ప్రజల ఉపాధి అవకాశాలు పెంచే డ్రైవింగ్ స్కూల్ ఏర్పాటుకు తెలుగుదేశం పార్టీ(టీడీపీ) దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి కొంగుబిగించారు. సచివాలయంలో గురువారం రవాణా, క్రీడా శాఖ మంత్రి మండపల్లి రాంప్రసాద్ రెడ్డి ని కలిసి సమస్యపై వివరించారు. సానుకూలంగా స్పందించిన మంత్రి త్వరలో తిరిగి ఇంటర్నేషనల్ డ్రైవింగ్ స్కూల్ దర్శిలో ఏర్పాటు చేసేందుకు నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రికి లక్ష్మి కృతజ్ఞతలు తెలిపారు.

ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ 2014 తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో దర్శిలో ప్రతిష్ఠాత్మకమైన ప్రాజెక్టుగా ఇంటర్నేషనల్ డ్రైవింగ్ స్కూల్ 18 కోట్లతో మంజూరు చేసి పనులు ప్రారంభించారు. దాదాపు మూడు కోట్ల రూపాయలను ఖర్చు చేశారు. ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఆ ప్రాజెక్టును పట్టించుకోకుండా గాలికి వదిలేసింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తిరిగి ఆ ప్రాజెక్టును ప్రారంభించేందుకు మంత్రిని కలిసినట్టు తెలిపారు.

గత అంచనాలను రివైజ్ చేస్తూ 28 కోట్ల అంచనాలతో మంత్రికి విన్నవించాం. త్వరలో దర్శి ప్రజల కల సహకారం కాబోతుందని అన్నారు.



### ఎన్డీయే సర్కారుపై నమ్మకంతో

# పారిశ్రామిక వేత్తలు క్యూ!

- వైసీపీ అప్పులు చేస్తే.. మేం పెట్టుబడులు తెస్తున్నాం
- ఫోన్లు వాడనివారికి ఐఫోన్ కంపెనీ గురించి ఏం తెలుస్తుంది?
- 4 నెలల్లో రాష్ట్రానికి రూ.60 వేల కోట్లకు పైగా పెట్టుబడులు
- నిజమైన విజయదశమి అంటే ఇదే
- టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి విజయ్ కుమార్



**మంగళగిరి, మహానాడు:** పెట్టుబడులు, అభివృద్ధి గురించి జగన్ రెడ్డి ఏనాడు ఆలోచించలేదని, ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రాష్ట్రానికి విదేశీ, స్వదేశీ కంపెనీలు క్యూ కడుతున్నాయని తెలుగుదేశం పార్టీ(టీడీపీ) రాష్ట్ర అధికార ప్రతినిధి నీలాయపాలెం విజయ్ కుమార్ అన్నారు. మంగళగిరిలోని పార్టీ జాతీయ కార్యాలయంలో గురువారం విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్ రెడ్డి ప్రభుత్వం అనేక అప్పులు చేసి వెళ్తే.. కూటమి ప్రభుత్వం కష్టించి పెట్టుబడులు తీసుకువచ్చి ఆ అప్పులు తీరుస్తోంది.

విన్ఫాస్ట్, మోగ్లిక్స్, వెర్మిరెన్ వంటి విదేశీ కంపెనీలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నాయి. మంత్రి నారా లోకేష్ కృషితో విశాఖలో టీసీఎస్ కంపెనీ తమ యూనిట్‌ను నెలకొల్పనుంది. ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి రాగానే తాము ఆంధ్ర రాష్ట్రానికి వస్తున్నామంటూ ఫాక్స్‌కాన్ సంస్థ మంత్రి లోకేష్‌ని కలిసింది. ఫాక్స్ కాన్, ఆపిల్ ఫోన్ లాంటి కంపెనీల గురించి జగన్‌కు అసలు అవగాహనే లేదు. ఫాక్స్ కాన్ సంస్థ ఐఫోన్‌లు తయారీ చేస్తుందని కూడా జగన్ రెడ్డికి తెలియదు. జగన్ ఫోన్లే వాడనంటారు. ఫోన్లు వాడనివారికి ఐఫోన్ కంపెనీ గురించి, అవి తయారు చేసే కంపెనీ పెట్టాలని ఆలోచన ఎక్కడి నుండి వస్తాయి? అని విజయ్ కుమార్ సందేహం వ్యక్తం చేశారు.

#### రాష్ట్రం నుండి పరిశ్రమలను జగన్ రెడ్డి తరిమేశారు...

2014-19 మధ్యలో సెల్కాన్, ఫాక్స్ కాన్ లాంటి కంపెనీలను బ్రహ్మాండంగా టీడీపీ ప్రభుత్వం పెట్టింది. ఎలక్ట్రాన్ సిటీకి 1501 ఎకరాలను నాడు టీడీపీ ప్రభుత్వం కేటాయిస్తే జగన్ రెడ్డి భూ కేటాయింపును రద్దు చేశారు. దుబాయికి చెందిన లూలూ సంస్థలకు నాడు టీడీపీ ప్రభుత్వం భూములను కేటాయిస్తే వైసీపీ అధికారంలోకి వచ్చాక వారిని తరిమేశారు. మళ్లీ అదే సంస్థ ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నెల్లూరు, తిరుపతిలో పెట్టుబడులు పెడతామని ముందుకొచ్చిందన్నారు.

#### పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొస్తున్న ప్రముఖ సంస్థలు

గండికోట, అలిపిరి, వైజాగ్, హార్స్ లీ హిల్స్‌లలో ఐదు నక్షత్రాల హొటళ్లు పెట్టడానికి ఒబెరాయ్ సంస్థ ముందుకొచ్చింది. ప్రఖ్యాతి చెందిన బ్రూక్ ఫీల్డ్ కార్పొరేషన్ సంస్థ పునరుత్పాదక శక్తి ఐటీని రూ.3 వేల కోట్ల పెట్టుబడులతో విజయవాడలో యూనిట్ ను విస్తరింపచేయడానికి ముందుకొచ్చింది. 4,500 మంది పనిచేసే హెచ్సీఎల్ సంస్థ కూడా తమ సంస్థ విస్తీరణకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ ఐటీ సంస్థ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు సిద్దంగా ఉంది.

అనంతపురంలో సుజ్లాన్ అనే విన్ టర్బైన్ల తయారీ కంపెనీ ఏర్పాటుకు ఆ సంస్థతో ఒప్పందం కుదిరింది. రూ.250 కోట్లతో ఎక్స్ఎల్ఆర్ఐ మేనేజ్‌మెంట్ ఇన్సిటిట్యూట్‌ను అమరావతిలో నిర్మించనుందని విజయ్ కుమార్ తెలిపారు. ముంబయికి చెందిన టాటా సన్స్, యూనిట్ మాల్ సంస్థ వైజాగ్‌లో పెట్టుబడులు పెట్టనున్నాయి. ఢిల్లీకి చెందిన జైరాజ్ ఇస్పాత్ సజ్జన్ గోయాంకా అనే సంస్థ రెండో యూనిట్‌ను కర్నూలులో విస్తరించనున్నారు.

చెన్నైకి చెందిన అపోలో యూనివర్శిటీని రాష్ట్రంలో నెలకొల్పనున్నారు. ఎస్ఆర్ఎం యూనివర్శిటీ వెయ్యి పడకల ఆసుపత్రి, ఏ1 యూనివర్శిటీని అమరావతిలో పెట్టనున్నారు. అమెరికాకు చెందిన గూగుల్ సంస్థ వైజాగ్‌లో యూట్యూబ్ అకాడమీని నెలకొల్పనుంది. సబ్ స్ట్రేట్ తయారీ కంపెనీ వైజాగ్‌లో ఏ1 మెటీరియల్ తాయారీ సంస్థ నెలకొల్పనుంది. గోద్రెజ్, ఆంధ్రా పేపర్, రీసోల్యుట్ ఎలక్ట్రానిక్స్ ఆరియా గ్లోబల్, ఇండియన్ డైజన్ గార్మెంట్స్, మ్యాగ్లిక్స్, వర్మీరన్, ఏపీ మెడ్ టెక్ జోన్, విన్ ఫాస్ట్ తదితర సంస్థలు రాష్ట్రానికి రావడానికి ఒప్పందం కుదిరిందని తెలిపారు.

#### పోలవరం డ్యామ్, రాజధాని నిర్మాణాలు పనులు చేయాల్సివుంది

పోలవరం డ్యామ్ నిర్మాణం వేగవంతం కానుంది. అమరావతిలో ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం కూడా చేయాల్సివుంది. కొప్పర్తి, ఓర్వకల్‌లో పారిశ్రామిక వాడలు, రైల్వే జోన్, రాష్ట్ర రోడ్లు, అమరావతి ఈస్టర్న్, వెస్టర్న్ బైపాస్ రోడ్ల నిర్మాణానికి కూడా ఒప్పందాలు కుదిరాయి. ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టిన రోజు నుంచి ప్రముఖ వ్యాపారవేత్తలు, పెట్టుబడిదారులు ముఖ్యమంత్రితో సంప్రదింపులు జరిపారు. 2014-19లో మా ప్రభుత్వం హయాంలో మేం ఎస్ఆర్ఎమ్, విఐటి, అమృత్ యూనివర్సిటీలను తీసుకువస్తే జగన్ రెడ్డి వాటికి రోడ్లు వేసిన పాపాన పోలేదు.

అమరావతిని జగన్‌రెడ్డి పాడుచేశారు. అమరావతికి కేంద్ర ప్రభుత్వం హామీ ప్రకారం 90 శాతం గ్రాంట్లుగా వరల్డ్ బ్యాంకు రూ.15,000 కోట్లు ఇవ్వనుంది.

పోలవరానికి రూ.2,500 కోట్లు కేంద్రం అందించింది. కర్నూలు జిల్లా ఓర్వకల్లు, కడప జిల్లా కొప్పర్తి పారిశ్రామిక పార్కులకు రూ.25 వేల కోట్లు పెట్టుబడులు, 75వేల మంది యువతకు ఉపాధికి కేంద్రం ఆమోదించింది. మొత్తంగా నాలుగు నెలల్లో రూ.60 వేల కోట్లకు పైగా పెట్టుబడులను ఈ మంచి ప్రభుత్వం తీసుకువచ్చింది. ఇదే నిజమైన విజయదశమి పండుగ. సంపద సృష్టి అంటే ఇదేనని జగన్ రెడ్డి తెలుసుకోవాలి అని సూచించారు.



గుడ్లవల్లేరు మండలంలో శ్రీదేవి శరన్నవరాత్రి వేడుకల్లో పాల్గొన్న గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

## రాజీనామాల ఆమోదం

**విజయవాడ, మహానాడు:** సోషల్ మీడియాలో వెలువడిన కథనాలు వల్ల భారతీయ జనతా పార్టీ(బీజేపీ) గుంటూరు జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర, మీడియా ప్యానెలిస్ట్ పాటిబండ్ల రామకృష్ణ రాజీనామాలు చేశారు. వీటిని పార్టీ రాష్ట్ర శాఖ ఆమోదించింది. వీరితోపాటు సోషల్ మీడియా కథనాల్లో ప్రస్తావనకు వచ్చిన సుకన్యను పార్టీ సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకుంది.

## ఏపీలో మద్యం షాపులకు విదేశాల నుంచి దరఖాస్తులు

**విజయవాడ, మహానాడు:** ఏపీలో మద్యం షాపులకు విదేశాల నుంచి దరఖాస్తులు వచ్చాయి. యూరప్, అమెరికా నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు పెట్టుకున్నారు. అమెరికా నుంచి 20 దరఖాస్తులు వచ్చినట్టు ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ చైతన్య మురళి వెల్లడించారు.





### మీ రాష్ట్రానికి

## మీరు వెళ్ళిపోండి...

- తెలంగాణలో పనిచేస్తున్న ఏపీ అధికారులకు కేంద్రం ఆదేశం

**న్యూఢిల్లీ:** తెలంగాణలో పనిచేస్తున్న ఆంధ్రప్రదేశ్ కేడర్ ఐఏఎస్ అధికారులు వెంటనే స్వరాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో రిపోర్ట్ చేయాలని కేంద్రం ఆదేశించింది. ఈ మేరకు ఆయా ఐఏఎస్ అధికారుల పేరిట లేఖలను రాస్తూ వాటి కాపీలను రెండు రాష్ట్రాల చీఫ్ సెక్రటరీలకు కేంద్రం మొన్న పంపించింది. వాకాటి కరుణ(ఐఏఎస్, 2004), రోనాల్డ్ రాస్(ఐఏఎస్, 2006), వాణీప్రసాద్(ఐఏఎస్, 1995), ఆమ్రపాలి కాట(ఐఏఎస్, 2010), ప్రశాంతి(నవంబర్ రిటైర్, 2009), అంజన్ కుమార్(ఐపీఎస్, 1990), అభిలాష బిస్త్(ఐపీఎస్, 1994), అభిషేక్ మహంతి( ఐపీఎస్, 2011)లకు లేఖలు కేంద్రం పంపించింది.



విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు సచివాలయంలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్‌ను కలిసి పలువురు విరాళాలు అందజేశారు. మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ఆధ్వర్యంలో రూ.25 లక్షల విరాళం అందజేశారు. కష్టాల్లో ఉన్న వారికి సాయం అందించిన దాతలకు ఈ సందర్భంగా మంత్రి కృతజ్ఞతలు తెలిపారు.

# పెద్దిరెడ్డి అండ... పదవితో అక్రమాలే అతని అజెండా!

- వైసీపీ నేతల దౌర్జన్యంపై ఫిర్యాదు
- గతంలో వైసీపీతో అంటకాగి మళ్లీ వీసీ పదవి కోసం ఆ ప్రొఫెసర్ పాకులాట
- పాత బిల్లులు ఇప్పించి ఆదుకోవాలని పలువురు విజ్ఞప్తి
- క్లైమ్స్ కోసం ఇంజక్షన్‌తో జనాల ప్రాణాలు తీస్తున్న హంతక ముఠా

**మంగళగిరి, మహానాడు:** అవినీతి కార్యక్రమాలకు పాల్పడుతూ.. ఆర్ఐఓ పదవి నుండి తొలగింపునకు గురై గత ప్రభుత్వంలో రాజకీయ పలుకుబడితో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అండతో కడప జిల్లా వృత్తి విద్యా అధికారిగా నియమితుడై నేడు ఇంటర్మీడియట్ విద్యలో పనిచేస్తున్న ఎస్. రవి అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ.. అక్రమ ట్రాన్ఫర్‌లతో మళ్లీ అవినీతి సంపాదనకు శ్రీకారం చుట్టారని అతని అవినీతికి అడ్డూ అదుపు లేదని.. తులసి వనంలో గంజాయి మొక్కలా ఉన్న అతనిపై చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా స్టూడెంట్ యూనియన్ విద్యార్థి సంఘ నాయకులు తెలుగుదేశం పార్టీ (టీడీపీ) కేంద్ర కార్యాలయంలో గురువారం నిర్వహించిన ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమంలోని నేతలను కలిసి విజ్ఞప్తి చేశారు. మంత్రి పొంగూరు నారాయణ, మర్రెడ్డి శ్రీనివాసరెడ్డిలు అర్జీలు స్వీకరించి విచారించి చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు.





- ఎవరికి అనుమానం రాకుండా డెలివరీ బాయ్ లా వచ్చి.. ఒక్క ఇంజక్షన్ పొడిచి గుండెపోటు వచ్చేలా చేసి మనిషిని చంపేసి అతనికి రావాల్సిన క్లైమ్స్ ను కొట్టేస్తున్నారని.. విభేదాలు ఉన్న, కోర్టు కేసులు ఉన్న కుటుంబాలే వారి టార్గెట్ అని.. మందుల షాపులు పెట్టుకుని, నకిలీ డాక్టర్స్ ఒక ముఠాగా తయారై జనాల ప్రాణాలు తోడేస్తున్నారని.. వారిపై చర్యలు తీసుకోవాలని కాకినాడ నుండి వచ్చిన పలువురు మంత్రి పొంగూరు నారాయణకు వినతి ఇచ్చి విజ్ఞప్తి చేశారు.
- తమ వ్యవసాయ భూమిని గోరా శ్రీను (బెజవాడ శ్రీను) దౌర్జన్యంగా దున్నతున్నాడని.. అతని దౌర్జన్యాలను అరికట్టి తమకు న్యాయం చేయాలని ప్రకాశం జిల్లా గిద్దలూరు నియోజకవర్గం రాజుపాలెం గ్రామానికి చెందిన ఆంజనేయ సాగర ప్రసాద్ గ్రీవెన్స్‌లో అర్జీని ఇచ్చి అభ్యర్థించాడు.
- తమ భూమిని ఆక్రమించి వైసీపీ నేతలు అక్రమ వెంచర్లు వేస్తున్నారని.. దాన్ని అడ్డుకోవడానికి వెళితే దుర్భాషలాడుతున్నారని.. ప్రకాశం జిల్లా వెలిగండ్ల మండలం మోటుపల్లి గ్రామానికి చెందిన బసవమ్మ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. అధికారులు విచారించి అక్రమార్కులు వేస్తున్న వెంచర్ ను తొలగించి తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు.
- కరోనా సమయంలో వందల మంది కరోనా పేషెంట్స్ కోసం సరఫరా చేసిన టెంట్స్, బెడ్ షీట్‌లు, బట్టలు, షాంపులు, వాటర్ టిన్నులు ఇతరత్రా దాదాపు రూ. 50 లక్షలకు పైగా ప్రభుత్వం ఆదేశాల మేరకు అప్పుగా తెచ్చి ఖర్చుపెట్టగా ఇప్పటికీ డబ్బులు తమకు అందలేదని.. దయచేసి తమకు బిల్లులు ఇప్పించి ఆదుకోవాలని భీమవరానికి చెందిన గంటా వెంకట సురేష్ నేతలను కోరారు.
- అనకాపల్లి జిల్లా యలమంచిలి మున్సిపాలిటీ కొక్కిరాపల్లికి చెందిన గొర్లె కొండలరావు విజ్ఞప్తి చేస్తూ.. తాము మున్సిపాటీలో అభివృద్ధి పనుల్లో భాగంగా 2018 లో చేపట్టిన పనులకు ఇప్పటికీ బిల్లులు రాలేదని.. తాము టీడీపీకి చెందిన వారమని బిల్లులు రాకుండా అడ్డుకున్నారని.. రావాల్సిన డబ్బులు ఇప్పించి ఆదుకోవాలని కోరారు.
- శ్రీ కృష్ణ దేవరాయ విశ్వవిద్యాలయం రూరల్ డవలప్‌మెంట్‌లో పనిచేస్తోన్న ఓ ప్రొఫెసర్ గత ప్రభుత్వంలో వైసీపీతో అంటకాగి.. మళ్లీ నేడు పదవి కోసం పాకులాడుతున్నారని.. వీసీ పదవికోసం అప్లై చేసుకున్నారని.. అతనికి ఆ పదవి ఇవ్వకుండా చూడాలని పలువురు గ్రీవెన్స్ లో ఫిర్యాదు చేశారు.
- తన భూమిని తనకు తెలియకుండానే బి.పవన్ కుమార్, బి.మధులు కలిసి మరొక వ్యక్తికి అమ్మారని.. దీనిపై తహశీల్దార్‌కు కూడా ఫిర్యాదు చేశామని అధికారులు అక్రమార్కులకు కొమ్ముకాస్తున్నారని.. దీనిపై విచారించి న్యాయం చేయాలని వి. వరదమ్మ అనే మహిళ గ్రీవెన్స్ ఫిర్యాదు చేశారు.
- సెగ్గెం నాగేశ్వరరావు, సెగ్గెం పద్మలు తమది కాని భూమిని అమ్ముకుని భూమికి అసలు వారసుడిని అయిన చల్లా వెంకటేశ్వర్లు అను తనని ఇబ్బంది పెడుతున్నారని.. దీనిపై విచారించి న్యాయం చేయకుండా పోలీసులతో బెదిరిస్తున్నారని.. గ్రీవెన్స్‌లో తెలియజేయగా.. పోలీసు అధికారులతో మాట్లాడి.. విచారించి బాధితుడికి న్యాయం చేయాలని మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు.
- మున్సిపల్ పాఠశాలల్లో ఉపాధ్యాయులను డిఎస్సీ ద్వారా నియమిస్తూ.. బదిలీలు చేయకపోవడంతో ఎంతో మంది భార్యాభర్తలు వేర్వేరు జిల్లాల్లో కుటుంబాలకు దూరంగా ఉండి ఉద్యోగాలు చేయాల్సి వస్తుందని.. దయ చేసి మున్సిపల్ ఉపాధ్యాయులకు జిల్లా బదిలీలు, సాధారణ బదిలీలు జరిపించాలని వారు వేడుకున్నారు.

జనం గుండె చప్పుడు
# మహానాడు
7
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ ‖ శుక్రవారం 11, అక్టోబర్ 2024 ‖



పీఏసీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ



## ఘనంగా ఆల్ ఇండియా సబ్ జూనియర్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్

- విజేతలకు మెడల్స్ అందజేసిన రాష్ట్ర రవాణా,యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

**విజయవాడ,మహానాడు:** చెన్నుపాటి రామకోటయ్య మున్సిపల్ ఇండోర్ స్టేడియంలో యోనేక్స్ సన్ రైస్ కాలగార నాగబాబు మెమోరియల్ ఏర్పాటు చేసిన ఆల్ ఇండియా సబ్ జూనియర్ ర్యాంకింగ్ బ్యాట్మెంటన్ టోర్నమెంట్ 2024 కార్యక్రమానికి రాష్ట్ర రవాణా యోజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి బ్యాడ్మింటన్ ఆటల పోటీలను వీక్షించారు. అండర్ 16 - 17 లో గెలుపొందిన క్రీడాకారులకు మంత్రి రాంప్రసాద్ రెడ్డి, శాప్ చైర్మన్ రవి నాయుడు పతకాలు, సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం టోర్నమెంట్ నిర్వాహకులు మంత్రి రాంప్రసాద్ రెడ్డిని, శాప్ చైర్మన్ రవి నాయుడుని ఘనంగా సన్మానించారు.



దేవీ నవరాత్రులు సందర్భంగా ఇంద్రకీలాద్రిపై ఉన్న అమ్మవారిని దర్శించుకున్న ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు



దేవీ నవరాత్రుల సందర్భంగా విజయవాడ కనకదుర్గ అమ్మవారిని దర్శించుకున్న ఎంపీ కలిశెట్టి



ఈనెల 15న వికారాబాద్ జిల్లా పరిగి నియోజకవర్గంలోని దామగుండంలో ఏర్పాటుకానున్న నేవీ రాడార్ స్టేషన్ శంకుస్థాపన కార్యక్రమానికి హాజరుకావాలని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖామాత్యులు కొండా సురేఖ గారిని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి ఆహ్వానించారు.



మంత్రి నారాయణను కలిసిన డీజీపీ ద్వారకా తిరుమల రావు.
తమ కుమార్తె వివాహానికి మంత్రిని ఆహ్వానించిన డీజీపీ.
ఈ నెల 26 న జరిగే వివాహ మహోత్సవానికి రావాల్సిందిగా కోరిన డీజీపీ ద్వారకా తిరుమలరావు.



తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఏపి స్టేట్ బేవరెజెస్ కార్పొరేషన్ ప్రతినిధులు గురువారం ప్రిన్సిపాల్ సెక్రెటరీ ముకేష్ కుమార్ మీనా ను కలిశారు.

## యూట్యూబ్‌లో ఇక 3 మినిట్స్ షార్ట్స్

కంటెంట్ క్రియేటర్స్ షార్ట్‌టైమ్‌లో ఆడియన్స్‌తో కనెక్ట్ అయ్యేందుకు 'షాట్స్'ని మరింత భిన్నంగా ప్లాన్ చేయొచ్చు. ఇకపై యూట్యూబ్ షాట్స్ నిడివిని ఇన్‌స్టాగ్రామ్ రీల్స్‌లాగా పెంచొచ్చు. అందుకు తగిన ఫీచర్‌ని ప్రత్యేక టెంప్లెట్‌లా అందించేందుకు యూట్యూబ్ సిద్ధమైంది. ఈ టెంప్లెట్‌తో నయా స్టైల్స్‌తో షాట్స్‌ని రూపొందించొచ్చు. ఈనెల 15 తర్వాత మూడు నిమిషాల షాట్స్‌ను యూజర్లు అప్‌లోడ్ చేసే ఫెసిలిటీ అమల్లోకి రానుంది.




## అర్జీలు స్వీకరించిన మంత్రి నారాయణ

**అమరావతి, మహానాడు:** మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ(టీడీపీ) కేంద్ర కార్యాలయంలో గురువారం మంత్రి నారాయణ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అప్పటికప్పుడే పలు అర్జీలకు సంబంధించి అధికారులతో ఫోన్ లో మాట్లాడారు. మరికొన్ని అర్జీలను ఆయా శాఖలకు పంపించారు. టిడ్కో ఇళ్ల కేటాయింపు, భూ సమస్యలు వంటి అర్జీలను మంత్రికి అందాయి.

### వైసీపీ రిలే దీక్షపై స్పందించిన మంత్రి నారాయణ

వైసీపీ రిలే దీక్షపై మంత్రి నారాయణ స్పందించారు. ఆయన ఏమన్నారంటే.. విజయవాడ వరదలపైన వైసీపీ రాజకీయం చేస్తోంది. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు అనేక ప్రయత్నాలు చేస్తున్నారు. దివిసీమ తర్వాత అంత తీవ్ర స్థాయిలో బుడమేరుకు వరదలు వచ్చాయి. గత ప్రభుత్వం చేసిన తప్పుల వల్ల వరదలు వచ్చాయి. కాలువలను పట్టించుకోకపోవడం, నిధులు కేటాయించకపోవడంతో బుడమేరు మూడు చోట్ల గండ్లు పడ్డాయి. ముఖ్యమంత్రి బస్సులోనే 10 రోజులు ఉండి సహాయక చర్యలు పర్యవేక్షించారు. చండీగఢ్ నుంచి విమానాల్లో బోట్లు తెప్పించారు.





ఏడు వేల మంది మున్సిపల్ కార్మికులు విజయవాడ వరదల్లో సహాయక చర్యల్లో పాల్గొన్నారు. ఎక్కడా అంటువ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకున్నాం. వైసీపీ నాయకులు దీక్షలు చేస్తే ప్రజలు నమ్మే పరిస్థితి లో లేరు. సీఎం చంద్రబాబు బుడమేరు వరదల్లో మోకాలి లోతు నెలల్లో తిరిగారు.

ప్రభుత్వాన్ని ప్రజలు మెచ్చుకోవడం ఓర్వ లేక జగన్ లేనిపోని ఆరోపణలు చేస్తున్నారు. వైసీపీ నాయకులు ఇలాగే చేస్తే వచ్చే ఎన్నికల్లో ఒక్క సీటు కూడా రాదు. వరద ఖర్చులకు సంబంధించిన అన్ని లెక్కలు క్లియర్ గా ఇచ్చాం. ఇంకా లెక్కలు కావాలంటే ఆర్‌టీఐ అప్లై చేస్తే మరింత వివరంగా ఇస్తాం.



## రతన్ టాటాకు టీడీపీ నేతలు ఘన నివాళి

**మంగళగిరి, మహానాడు:** స్థానిక తెలుగుదేశం పార్టీ(టీడీపీ) కేంద్ర కార్యాలయంలో నేతలు రతన్ టాటా చిత్రపటానికి ఘన నివాళులు అర్పించారు. ప్రజల కోసం దేశం కోసం ఆయన చేసిన సేవలను కొనియాడారు. పారిశ్రామికవేత్తలు ఆయన్ను ఆదర్శంగా తీసుకుని దేశంలో పేదరిక నిర్మూలనకు సహకరించాలని.. భారత ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి తోడ్పడాలని ఆకాక్షించారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అశోక్ బాబు, టీడీపీ రాష్ట్ర రైతు సంఘ అధ్యక్షులు మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి, మీడియా కో ఆర్డినేటర్ ధారపునేని నరేంద్రబాబు, నేతలు ఫర్వీన్ తాజ్, దేవినేని శంకర్ నాయుడు, పాతర్ల రమేష్, దేవతోటి నాగరాజు, ములక సత్యవాణి, గాజుల ఖాధర్ భాష, పర్చూరి కృష్ణా, మల్లుదొర, రాజశేఖర్, పీరయ్య, హాజీ హషన్ భాషా, బాపనయ్య తదితరులు పాల్గొన్నారు.

## అర్హులకు పక్కా గృహం... ప్రభుత్వ ధ్యేయం

- గృహనిర్మాణ సంస్థ చైర్మన్ తాతయ్యబాబు

**విజయవాడ, మహానాడు:** రాష్ట్రంలోని ప్రతి ఒక్క పేద వాడికి పక్కా గృహం నిర్మించే విధంగా ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ చైర్మన్ బత్తుల తాతయ్య బాబు తెలిపారు.

రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ చైర్మన్‌గా నియమితులైన తాతయ్యబాబు గురువారం విజయవాడలోని రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ కార్యాలయంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు అన్ని సౌకర్యాలతో గృహాలు నిర్మిం చాలన్నది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ధ్యేయమని, ఎన్నికల మేనిఫెస్టో లో పేర్కొన్న విధంగా గృహాల నిర్మాణం పూర్తి చేస్తామని వివరించారు.





## మైనర్ బాలుడు ఉప్పాల అమర్‌నాథ్ కుటుంబానికి న్యాయం చేస్తాం..

- కేసును ఫాస్ట్ ట్రాక్ కోర్టుకు బదిలీ చేసి వేగంగా దర్యాప్తు చేయాలని డీజీపీని ఆదేశించిన హోంమంత్రి వంగలపూడి అనిత

**అమరావతి,మహానాడు:** గత ప్రభుత్వ హయాంలో దారుణహత్యకు గురైన మైనర్ బాలుడు ఉప్పాల అమర్ నాథ్ కుటుంబానికి న్యాయం చేస్తామని హోం మంత్రి వంగలపూడి అనిత వెల్లడించారు.

తన సోదరిని వేధించవద్దని వారించిన కారణంగా బాపట్ల జిల్లా చెరుకుపల్లి మండలం ఉప్పాలవారిపాలేనికి చెందిన 16 ఏళ్ల తమ చిన్నారి అమర్ నాథ్ ని గతేడాది పెట్రోల్ పోసి నిప్పంటించారంటూ బాధిత కుటుంబం, గౌడ సేన నాయకులు హోం మంత్రిని కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. కేసును ఫాస్ట్ ట్రాక్ కోర్టుకు బదిలీ చేసి వేగంగా దర్యాప్తు చేయాలని నిందితులకు శిక్షపడేలా చూడాలని హోం మంత్రికి వారు సచివాలయంలో వినతి పత్రం సమర్పించారు.



మంగళగిరి ఎన్ఆర్ఐ ఆసుపత్రికి జ్యోత్స్న భౌతికకాయం అప్పగింత. విజయవాడ బార్ అసోసియేషన్ వద్ద న్యాయవాదులు, బాలోత్సవ్ భవన్ వద్ద సిపిఎం, ఇతర నేతలు శ్రద్ధాంజలి



విజయవాడ ఇంద్రకీలాద్రి అమ్మవారిని దర్శించుకున్నటిడిపి నేత బుద్ద వెంకన్న



**అమరావతి:** ఈనెల 14 15 తేదీలల్లో విజయనగరంలో జరిగే పైడితల్లి అమ్మవారి తోల్లేళ్లు, సిరిమానోత్సవం కార్యక్రమంలో పాల్గొనాల్సిందిగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తోపాటు క్యాబినెట్ సహచరులు అందరినీ ఆహ్వానిస్తూ వారికి రాష్ట్రమంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో విజయనగరం యంపి, ఎమ్మెల్యే కలిశెట్టి అప్పలనాయుడు, పూసపాటి అధితి విజయలక్ష్మి గజపతిరాజు ఆహ్వాన పత్రికలు అందజేశారు.



విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో చిరు వ్యాపారం చేసుకునేందుకు ఇబ్బంది పడుతున్న ఇద్దరు చిరు వ్యాపారులకు ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) గురువారం తోపుడు బండ్లు అందజేశారు. గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్ లో 54వ డివిజన్ వించిపేటలో నివసించే ఎం.తిరుపతమ్మ, 51వ డివిజన్ శ్రీనివాసమహల్ సెంటర్ కి చెందిన మావూరి వెంకట్రావు లకు కూరగాయల వ్యాపారం చేసుకునేందుకు ఈ తోపుడు బండ్లను ఎన్టీఆర్ జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు సొలంకి రాజు సహకారంతో లబ్ధిదారులకు అందించారు.

జనం గుండె చప్పుడు
# మహానాడు
8
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || శుక్రవారం 11, అక్టోబర్ 2024 ||



## ప్రశాంత్ వర్మ మహాకాళి..
# తొలి సూపర్ హీరోయిన్ వచ్చేసింది

ఇక భారతదేశపు తొలి మహిళా సూపర్ హీరోయిన్‌గా నిలిచే "మహాకాళి" పేరుతో రూపొందుతోంది
ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్ (PVCz) నుండి వచ్చిన తొలి చిత్రం "హనుమాన్" పాన్ ఇండియా బ్లాక్‌బస్టర్ గా నిలిచిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఈ క్రియేటివ్ డైరెక్టర్ %ాంఎజఖ% నుండి మూడవ ప్రాజెక్ట్‌ను ప్రకటించారు. ప్రొడ్యూసర్ రివాజ్ రమేష్ దుగ్గల్ RKD స్టూడియోస్ బ్యానర్ పై ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. RK దుగ్గల్ ప్రెజెంటర్ గా వ్యవహరిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా RKD స్టూడియోస్ నిర్మాణ రంగంలోకి రాబోతోంది. ఈ చిత్రానికి ప్రశాంత్ వర్మ కథ, స్క్రీన్ ప్లే అందిస్తుండగా, పూజా అపర్ణా కొల్లూరు అనే మహిళా దర్శకురాలు దర్శకత్వం వహిస్తున్నారు. ఇక భారతదేశపు తొలి మహిళా సూపర్ హీరోయిన్ గా నిలిచే "మహాకాళి" పేరుతో రూపొందుతోంది. ప్రత్యేకంగా, సాంప్రదాయాలకు, ఆధ్యాత్మికతకు అనుగుణంగా రూపుదిద్దుకునే ఈ చిత్రం సామాజిక అంశాలను స్పృశిస్తూ, ఆధునిక సమస్యలతో కూడిన కథా నేపథ్యాన్ని కలిగి ఉంటుందని మేకర్స్ తెలిపారు. మహాకాళి కథ బెంగాల్ రాష్ట్రాన్ని ప్రధాన ప్రదేశంగా తీసుకుని సాగుతుంది. గడచిన సాంప్రదాయాలకు, దేవతా స్థాయికి చెందిన గొప్ప సంపదను వెండితెరపై చూపించే ఈ చిత్రం, సామాజికంగా సమకాలీనమైన అంశాలతో కూడిన భావోద్వేగ కథనంతో ముందుకు వస్తుంది. సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్ కూడా రిలీజ్ అయ్యింది. ఆ పోస్టర్ లో ఒక పులితో ఒక అమ్మాయి కనిపిస్తుంది. వెనుక భాగంలో గుడిసెలు, బంట్లు మరియు భయంతో పారిపోతున్న ప్రజలు, అందులోనే ఓ ఫెరిస్ వీల్ దగ్ధం అవుతున్నట్లు చూపించబడింది. టైటిల్ పోస్టర్ కూడా బెంగాలీ ఫాంట్ లో, నక్షత్రాకారంలో డిజైన్ చేయబడింది.



## వినూత్న తరహాలో లగ్గం ట్రైలర్

సినిమా ప్రమోషన్స్ కొత్తగా చెయ్యాలి, బజ్ క్రియేట్ చెయ్యాలి, ప్రేక్షకుల్లోకి సినిమా తీసుకెళ్లాలి అని ఉద్దేశంతో డిఫరెంట్ ఐడియాలతో ముందుకొస్తున్నారు "లగ్గం" టీమ్. రెగ్యులర్గా సినిమా ఇండస్ట్రీలో ఉన్న టాప్ హీరోస్, లేక టాప్ ప్రొడ్యూసర్తో టీజర్ , ట్రైలర్స్ లాంచ్ చేపించడం అనేది మనం చూస్తున్నదే. కానీ వీటన్నింటినీ దాటి ఇప్పటివరకు ఎవ్వరు చెయ్యని విధంగా తమ సినిమా ప్రమోషన్స్ మొదలు పెట్టింది. లగ్గం సినిమా టీమ్. సినిమా మొదలుకొని పాటలు, పోస్టర్స్, టీజర్ అంటూ వరుసగా రోజు ప్రేక్షకులను పలకరిస్తూ "రీల్ పెట్టు – చీరపట్టు" అనే డిఫెరెంట్ కాన్సెప్ట్ తో ప్రమోషన్స్ మొదలు పెట్టి దూసుకుపోతుంది. ఒక వైపు లగ్గం ట్రావెలర్ ఊరూరా తిరుగుతూ లగ్గం గిఫ్ట్స్ అందిస్తూ అందరికీ చేరువ అవుతుంది. అదే తరహాలో ట్రైలర్ లాంచ్ ఈవెంట్ కోసం మరో కొత్త ఐడియాతో ముందుకు వచ్చింది టీమ్.



## మంచు విష్ణుకి అనుకూలంగా
# ఢిల్లీ హైకోర్టు ఉత్తర్వులు

మంచు విష్ణుకి వ్యతిరేకంగా యూట్యూబ్ చానెళ్లలో ఉన్న వీడియోలు, కంటెంట్‌ను తొలగించాలని ఢిల్లీ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. వ్యక్తి ప్రతిష్ట దిగజార్చేలా ఉన్న కంటెంట్‌ను వెంటనే తొలిగించాలని కోర్టు తీర్పునిచ్చింది. ఆయన స్వరం, ఆయన పేరు, ఆయన తీసిన సినిమాలను ప్రత్యక్షంగా, పరోక్షంగా దుర్వినియోగం చేయొద్దని హెచ్చరించారు. ఈ మేరకు పది యూట్యూబ్ లింక్‌లకు హైకోర్టు స్వీట్ వార్నింగ్ ఇచ్చింది.

ఈ తీర్పు సోషల్ మీడియాలో నటులు, వారి కుటుంబాల పై అవమానకరమైన సమాచారాన్ని అరికట్టేందుకు విష్ణు మంచు చేపట్టిన విస్తృత ప్రయత్నాలను బలపరుస్తోంది. మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ (మా) అధ్యక్షుడిగా, విష్ణు మంచు అనైతిక యూట్యూబ్ ఛానళ్ళ పై అవమానకరమైన సమాచారాన్ని పోస్ట్ చేసే వారి పై చర్యలు తీసుకోవడంలో ముందడుగు వేశారు. ఇప్పటివరకు ఆయన చర్యల ద్వారా 75 అవమానకరమైన యూట్యూబ్ లింకులు తొలగించబడ్డాయి. ఇది సెలబ్రిటీలకు ఒక సురక్షితమైన వాతావరణం కల్పించడం కోసం ముందడుగు పడినట్టు అయింది.


అవమానకరమైన విషయాలు, ఏ పద్ధతిలోనైనా ప్రచురణ లేదా ప్రచారం చేయకుండా కోర్టు తీర్పునిచ్చింది. విష్ణు మంచు పేరు, స్వరం, చిత్రము, లేదా ఏ ఇతర ప్రత్యేక లక్షణాలను వాణిజ్య లేదా వ్యక్తిగత ప్రయోజనం కోసం అనధికారికంగా వినియోగించకూడదని తెలిపింది. విష్ణు మంచు వ్యక్తిత్వ/ప్రచారం హక్కులను అపహరించడం, దుర్వినియోగం చేయడం వంటివి చేయకూడదని కోర్టు ఉత్తర్వులు ఇచ్చింది.

అవమానకరమైన సమాచారాన్ని కలిగిన లింకులని నిలిపివేయాలని ఐటీ, టెక్నాలజీ మంత్రిత్వ శాఖలను కోర్టు ఆదేశించింది. నిందితులు 48 గంటలలోపు అన్ని ఉల్లంఘనల విషయాలను తొలగించవలసి ఉంటుంది, లేకపోతే యూట్యూబ్ ఈ విషయాలను నిరోధించి/నిలిపివేయవలసి ఉంటుందని కోర్టు తెలిపింది.

## "గుడ్ బ్యాడ్ అగ్లీ" సెట్స్ నుంచి
# అదరగొట్టిన థలా

కోలీవుడ్ సినిమా దగ్గర ఉన్నటువంటి బిగ్గెస్ట్ మాస్ హీరోస్ లో థలా అజిత్ కూడా ఒకరు. మరి అజిత్ ఇప్పుడు రెండు సినిమాల్లో నటిస్తుండగా వాటిలో దర్శకుడు తన అభిమాని అయినటువంటి అధిక్ రవిచంద్రన్ తెరకెక్కిస్తున్న సాలిడ్ ఎంటర్టైనర్ చిత్రం "గుడ్ బ్యాడ్ అగ్లీ" కూడా ఒకటి. మరి ఈ సినిమా అనౌన్స్ చేసిన నాటి నుంచి మంచి అంచనాలు నెలకొనగా ఈ సినిమా కోసం అజిత్ ప్రిపేర్ చేసిన కొత్త లుక్ ఫ్యాన్స్ కి మంచి కిక్ ఇచ్చింది.

ఇక ఇదిలా ఉండగా ఈ సినిమా సెట్స్ నుంచి దర్శకుడు తన అభిమాన హీరోపై పెట్టిన పోస్ట్ వైరల్ గా మారింది. అజిత్ వైట్ అండ్ వైట్ సూట్ లో స్టైలిష్ లుక్స్ తో అదరగొట్టారు అని చెప్పాలి. దీనితో ఈ పిక్ ఫ్యాన్స్ లో హిట్ అయ్యింది. మరి ఈ సినిమా షూటింగ్ శరవేగంగా పూర్తి చేస్తుండగా వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా మేకర్స్ రిలీజ్ కి సిద్ధం చేస్తున్నారు. అలాగే దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రంని టాలీవుడ్ నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ వారు నిర్మాణం వహిస్తున్నారు.



## రామ్ భజరంగ్ ఫస్ట్ లుక్

సన్ రైజ్ ఎంటర్టైన్మెంట్ బ్యానర్ పై నిర్మాత స్వాతిసుధీర్ నిర్మిస్తున్న సినిమా రామ్ భజరంగ్. రాజ్ తరుణ్ , సందీప్ మాధవ్ హీరోలుగా నటిస్తున్న రామ్ భజరంగ్ సినిమాకు సి.హెచ్.సుధీర్ రాజు దర్శకత్వం వహిస్తున్నారు.
మణిశర్మ సంగీతం అందిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ దాదాపు పూర్తి అయ్యింది, దసరా సందర్భంగా రామ్ భజరంగ్ ఫస్ట్ లుక్ ను చిత్ర యూనిట్ విడుదల చేసింది. ఫస్ట్ లుక్ పోస్టర్ చాలా ఆసక్తికరంగా మాసీగా ఉందని, ఇద్దరు హీరోలు రాజ్ తరుణ్, సందీప్ మాధవ్ చాలా డిఫరెంట్ లుక్స్ , గెటప్స్ లో ఉన్నారని పాజిటీవ్ కామెంట్స్ వస్తున్నాయి.



Published by **Bodepudi Venkata Subbarao Managing Director** on behalf of Mahanadu Media pvt ltd. **Editor: Marthi Subrahmanyam** Phone: 9705311144